

వృద్ధులను ప్రభుత్వం ఇలా ఇబ్బంది పెట్టడం సరికాదు



పింఛను సొమ్ము కోసం రెండు రోజులుగా బ్యాంకు చుట్టూ తిరుగుతున్నా. పింఛన్ సొమ్ము ఏ ఖాతాలో జమ అయిందో తెలియడం లేదు. దీనిని గుర్తించడానికి చాలా పాట్లు పడ్డాను. వృద్ధులను ప్రభుత్వం ఇలా ఇబ్బంది పెట్టడం సరికాదు.

- సంపతి మల్లయ్యమ్మ, రామన్నపాలెం, కొయ్యూరు మండలం



విశాఖ కంచరపాలెం మెట్టు వద్ద సభకు హాజరైన అశేష ప్రజానీకం

భూములు దోచేస్తున్న దుష్టచతుష్టయం

జగన్, బొత్స, వైవీ సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డిలపై నందమూరి బాలకృష్ణ ధ్వజం

- జగన్ ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చి...జనాన్ని పాతాళంలోకి నెట్టారు
- మూడు రాజధానులంటూ నాటకమాడి ఒక్కటి కూడా లేకుండా చేశారు
- గులకరాయి డ్రామాలతో మళ్లీ ప్రజలను మభ్య పెట్టేందుకు యత్నం
- కూటమి మేనిఫెస్టోతో అన్ని వర్గాల జీవితాల్లో వెలుగులు



మాట్లాడుతున్న బాలకృష్ణ

విశాఖపట్నం, మే 3 (ఆంధ్రజ్యోతి): 'దుష్టచతుష్టయం...జగన్‌రెడ్డి, బొత్స సత్యనారాయణ, వైవీ సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డిలు ఉత్తరాంధ్రలో భూములు దోచేశారు. విశాఖలో విలువైన బే పార్క్, సీబీసీఎన్‌సీ భూములను కబ్జా చేశారు.' అని తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, హిందూపురం ఎమ్మెల్యే, నటుడు నందమూరి బాలకృష్ణ విరుచుకుపడ్డారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా విశాఖపట్నం వచ్చిన ఆయన శుక్రవారం సాయంత్రం విశాఖ పరిధిలో పలు ప్రాంతాల్లో రోడ్డు షో నిర్వహించారు. అనంతరం కంచరపాలెం మెట్టు వద్ద నిర్వహించిన సభలో ప్రజలను ఉద్దేశించి బాలకృష్ణ ప్రసంగించారు. బొత్స, ధర్మాన, తమ్మినేని, అవంతి, అమర్ వంటి నేతల వల్ల ఉత్తరాంధ్ర ప్రాంతానికి ... మిగతా 6వ పేజీలో

బాలయ్యకు బ్రహ్మరథం · 6లో

పండుటాకులకు అవే పాట్లు

పింఛన్ నగదు కోసం రెండో రోజూ బ్యాంకుల వద్ద పడిగాపులు

- మండుటెండలో దూర ప్రాంతాల నుంచి ఆటోల్లో వచ్చిన వృద్ధులు
- గంటల తరబడి నిరీక్షణ
- వైసీపీ ప్రభుత్వం ఇలా వేధించడం సరికాదని ఆవేదన



దేవరాపల్లిలో యూకో బ్యాంకు వద్ద ఉదయం 9 గంటలకే వేచి ఉన్న వృద్ధులు

దేవరాపల్లి/చోడవరం/కృష్ణాదేవిపేట/గొలుగొండ/నర్సీపట్నం, మే 3: **సామాజిక పింఛన్ల లబ్ధిదారులను వేధించే విధంగా వైసీపీ ప్రభుత్వం కుట్ర చేసిందని ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలకు బలం చేకూర్చేలా జిల్లాలో పరిస్థితులు ఉన్నాయి. పింఛన్ నగదు కోసం శుక్రవారం కూడా వృద్ధులు, దివ్యాంగులు మండుటెండలో ఆపసోపాలు పడుతూ బ్యాంకులకు వచ్చారు. చాలా మందికి ఖాతాలు మనుగడలో లేకపోవడం, ఈకేవైసీ సమస్య వల్ల నగదు చెల్లింపులు జరగలేదు. దీంతో వారంతా నిరాశతో ఇంటి ముఖం పట్టారు. కాగా బ్యాంకుల వద్ద చెల్లింపులు ఆలస్యం కావడంతో గంటల తరబడి వృద్ధులు వేచి ఉన్నారు.**



గొలుగొండ మండలం ఏఎల్‌పురంలో ఎస్‌బీఐ సేవా కేంద్రం వద్ద నగదు తీసుకునేందుకు వేచి వున్న వృద్ధులు

దేవరాపల్లి మండలంలో 10,500 మంది పింఛన్‌దారులు ఉంటే 8 వేల మంది ఖాతాల్లోనే నగదు జమ అయ్యింది. మిగతా వారికి ఆధార్ నంబరు బ్యాంకు ఖాతాకు అనుసంధానం కాకపోవడం, బ్యాంకుకు ఫోన్ నంబరు లింకేజీ కాకపోవడంతో లబ్ధిదారులు ... మిగతా 8వ పేజీలో

15 కిలో మీటర్ల దూరం నుంచి వచ్చా..



నాకు పక్షవాతం వచ్చి నడవ లేని స్థితిలో ఉంటే పింఛన్ సొమ్ము బ్యాంకు ఖాతాలో వేశారు. కుటుంబ సభ్యులను వెంటబెట్టుకొని 15 కిలోమీటర్లు దూరంలో ఉన్న కోడాపల్లి నుంచి ఆటోలో దేవరాపల్లి వచ్చాను. చాలా ఇబ్బంది పడ్డాను.

- కాసుల చిన్నాలమ్మ, కోడాపల్లి, వాలాబు పంచాయతీ, దేవరాపల్లి మండలం

బ్యాంకు చుట్టూ తిరుగుతున్నా..



ఇటీవల మా పూరిల్లు కాలిపోయింది. ఆధార్ కార్డు, బ్యాంకు పుస్తకం దగ్ధమయ్యాయి. బ్యాంకులో పింఛన్ నగదు వేశారని చెబితే ఇక్కడికి వచ్చాను. ఖాతా మనుగడలో లేదని, ఆధార్ జెరాక్స్ తేవాలని సిబ్బంది చెప్పారు. నా దగ్గర ఏమీ లేవు. పోస్టాఫీసుకు వెళ్లి మళ్లీ ఆధార్ తీసుకుందామంటే ఓటీపీ చెప్పాలి. ఫోన్ నంబరు అప్పుడుది అడుగుతున్నారు. నాకు ఫోనే లేదు. ఏం చేయాలో తెలియడం లేదు. రెండు రోజుల నుంచి బ్యాంకు చుట్టూ తిరుగుతున్నాను.

- చోడి నూకరాజు, నాగయ్యపేట, దేవరాపల్లి మండలం

నేడు ఎలమంచిలిలో బాలకృష్ణ రోడ్ షో

- విజయవంతం చేయాలని ప్రగడ, సుందరపు పిలుపు

ఎలమంచిలి, మే 3: నియోజకవర్గ కేంద్రం ఎలమంచిలి పట్టణంలో శనివారం సాయంత్రం 4 గంటలకు తెలుగుదేశం సీనియర్ నేత, ఎమ్మెల్యే, నటుడు నందమూరి బాలకృష్ణ పర్యటించనున్నారు. దిమిలి రోడ్డు జంక్షన్ వద్ద బాలకృష్ణ రోడ్ షో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని కూటమి శ్రేణులు విజయవంతం చేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, జనసేన పార్టీ అసెంబ్లీ అభ్యర్థి సుందరపు విజయకుమార్ కోరారు. స్వర్ణాంధ్ర సాకార యాత్ర పేరుతో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు, అభిమానులు తరలిరావాలన్నారు.

టీడీపీలో చేరనున్న దేవరాపల్లి ఎంపీపీ దంపతులు?

- రెండు, మూడు రోజుల్లో చేరే అవకాశం
- ఇప్పటికే ఎంపీపీ పదవికి రాజీనామా చేసిన కిలపర్తి రాజేశ్వరి

చోడవరం, మే 3: డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు ఇలాకాలో దేవరాపల్లి ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, ఆమె భర్త కిలపర్తి భాస్కర్‌లు టీడీపీలో చేరనున్నట్టు సమాచారం. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుతో విభేదాల నేపథ్యంలో వైసీపీ నేత కిలపర్తి భాస్కరరావు సతీమణి రాజేశ్వరి గత నెల 15న ఎంపీపీ పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. కిలపర్తి రాజేశ్వరి పదవికి రాజీనామా చేసిన నాటి నుంచి భాస్కరరావు, రాజేశ్వరిలు వైసీపీకి దూరంగానే ఉన్నారు. ఎంపీపీ పదవికి రాజీనామా చేసిన తరువాత నుంచి కిలపర్తి భాస్కరరావు టీడీపీలో చేరతారన్న ప్రచారం సాగుతున్నది. ఈ నేపథ్యంలోనే ఎంపీపీ రాజేశ్వరి శుక్రవారం మాజీ మంత్రి బండారు సత్యనారాయణ సతీమణితో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొనడంతో కిలపర్తి దంపతులు టీడీపీ తీర్థం పుచ్చుకోవడం ఖాయమని తెలిసింది. రెండు, మూడు రోజుల్లో దేవరాపల్లి మండల కేంద్రంలో ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ సమక్షంలో కిలపర్తి దంపతులు టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నట్టు తెలుస్తున్నది.

ఇప్పుడే గుర్తొచ్చిందేమిటబ్బా!

మూడు నెలల క్రితం నిలిచిపోయిన నర్సీపట్నం మెయిన్ రోడ్డు పనులు

- కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతో బ్రేక్
- పది రోజుల్లో ఎన్నికలు ఉన్నాయనగా హడావిడిగా రాత్రి వేళ పనులు పునఃప్రారంభం
- ఓటర్లకు గాలం వేయడానికేనని జోరుగా చర్చ



నర్సీపట్నం మెయిన్ రోడ్డులో గురువారం రాత్రి పనులు చేపట్టడంతో ఇలా..

నర్సీపట్నం, మే 3: **మూడు నెలల క్రితం నిలిచిపోయిన నర్సీపట్నం మెయిన్‌రోడ్డు పనులు హఠాత్తుగా గురువారం రాత్రి మొదలయ్యాయి. రహదారి పనులు అస్తవ్యస్తంగా ఉండడంతో అప్రతిష్ఠ మూటకట్టుకున్న వైసీపీ ప్రభుత్వం పది రోజుల్లో ఎన్నికలు ఉన్నాయనగా హడావిడిగా పనులు ప్రారంభించిందని, ఇది ఓటర్లకు గాలం వేయడమేనని పలువురు చర్చించుకుంటున్నారు.**

అబీద్ సెంటర్ నుంచి పెదబొడ్డేపల్లి వంతెన వరకు రూ.10.6 కోట్లతో 1.5 కిలో మీటర్లు మేర మెయిన్ రోడ్డు విస్తరణ, సెంటర్ డివైడర్ అభివృద్ధి పనులకు 2022 డిసెంబరు 30వ తేదీన సీఎం శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన చేసిన ఏడు నెలలకు అంటే గత ఏడాది జూలై 21న స్థానిక ఎమ్మెల్యే రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించారు. మెయిన్ రోడ్డులోని ప్రైవేటు భవన యజమానులు భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని కోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వ భవనాలు అధికంగా ఉన్న చోట 100 అడుగుల విస్తరణ చేసి, ప్రైవేటు ఆస్తులు ఉన్న చోట 90 అడుగులు రోడ్డు విస్తరణ చేయడానికి ఎమ్మెల్యే నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ భవనాలు అధికంగా ఉన్న అబీద్ సెంటర్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు రోడ్డు అభివృద్ధి చేసి ప్రజలకు మోడల్‌గా చూపిస్తామని ప్రకటించారు. గత ఏడాది జూలై నెలలో రోడ్డు విస్తరణ పనులు మొదలు పెట్టారు. ఎన్టీఆర్ మినీ స్టేడియం ముందు ఉన్న మునిసిపల్ దుకాణాలు పూర్తిగా పడగొట్టారు. ఎస్సీ కార్పొరేషన్ దుకాణాలు, ఎన్జీవోస్ హోమ్ ముందు దుకాణాలు పాక్షికంగా తొలగించారు. సబ్ కలెక్టర్ కార్యాలయం, పాల్‌ఘాట్ సెంటర్‌లోని ఎస్సీ బాలికల వసతి గృహం ప్రహరీ గోడలు పడగొట్టి పునర్నిర్మాణం చేశారు. అబీద్ సెంటర్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు పది నెలల కాలంలో 265 మీటర్లు రోడ్డు చదును చేసి తారు వేయడానికి ఏర్పాట్లు చేశారు. రోడ్డు సెంటర్ డివైడర్ నిర్మాణం పనులు పూర్తి చేసి వీధి దీపాలు అమర్చడానికి స్తంభాలు వేశారు. ఇప్పటి వరకు జరిగిన పనులకు కాంట్రాక్టర్‌కు రూ.3 కోట్లు బకాయి ఉండడంతో మూడు నెలల క్రితం పనులు నిలిచిపోయాయి. అయితే పది రోజుల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో తారు రోడ్డు పనులు మొదలు పెట్టారు. డ్రైనేజీ కనెక్టివిటీ లేకపోతే వర్షం పడితే రోడ్డంతా బురదమయం అవుతుంది. డ్రైనేజీ పూర్తి చేయకుండా తారు పోస్తే ఉపయోగం ఏముంటుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దీనిపై కమిషనర్ పూడి రవిబాబుని వివరణ అడగగా కాంట్రాక్టరు తారు రోడ్డు పనులు చేస్తున్నారని తెలిపారు. కాంట్రాక్టర్ చేసిన పనికి బిల్లులు రావల్సి ఉందని చెప్పారు.

అజినోమోటో బయో ఫార్మాలో ప్రమాదం

- రసాయన వాయువు లీకై ఐదుగురు కార్మికులకు అస్వస్థత
- ఆస్పత్రికి తరలింపు
- ఆలస్యంగా వెలుగు చూసిన వైనం

పరవాడ, మే 3: ఫార్మాసిటీని ఆనుకుని ఉన్న ఎస్‌ఈజెడ్‌లో గల అజినోమోటో బయో ఫార్మా పరిశ్రమలో గురువారం ప్రమాదం చోటు చేసుకుంది. రసాయన వాయువులు లీకై ఐదుగురు కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. వీరంతా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనికి సంబంధించి పరవాడ సీఐ బాల సూర్యారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎస్.సాయి (28), బాగల సుధాకర్ (37), కె.ప్రదీప్‌వర్మ (42), ఎం.రాము నాయుడు (35), జె.సతీశ్(35)లు గత కొంతకాలంగా అజినోమోటో బయో ఫార్మా పరిశ్రమలో పనిచేస్తున్నారు. వీరంతా గురువారం బీ షిప్ట్ విధులకు హాజరయ్యారు. వీరు మొదటి అంతస్తులో గల ప్రొడక్షన్ బ్లాక్ వద్ద ... మిగతా 8వ పేజీలో


పార్కు హోటల్ నుంచి భారీ ద్విచక్ర వాహన ర్యాలీతో బయలుదేరిన హీరో బాలకృష్ణ

బాలయ్య సూపర్ షో

ప్రముఖ నటుడు, తెలుగుదేశం పార్టీ ముఖ్య నేత, హిందూపురం శాసనసభ్యుడు నందమూరి బాలకృష్ణ నగరంలో శుక్రవారం పెదజాలరి పేట నుంచి ఆరిలోవ చివరి బస్టాప్ వరకు కంచరపాలెం మెట్టులో సభ అనంతరం తిరిగి గోపాలపట్నం జంక్షన్ వరకూ స్వర్ణాంధ్ర సాకార యాత్ర పేరుతో చేపట్టిన రోడ్ షో విజయవంతమయింది. అడుగడుగునా నగర వాసులు బాలయ్యకు బ్రహ్మరథం పట్టారు. ఎక్కడికక్కడ మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. అభిమానులను ఉత్సాహపరుస్తూ బాలయ్య రోడ్ షో నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి


పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు ఇంటి వద్ద భారీ గజమాలతో సత్కారం


కంచరపాలెం మెట్టు వద్ద ప్రజలకు నమస్కరిస్తున్న బాలకృష్ణ


తెలుగుదేశం పార్టీ జెండాలతో యువతుల కేరింతలు


అభిమాన నేతపై మహిళల పూల వర్షం


జాలారిపేటలో చిన్నారిని ముద్దాడుతున్న నందమూరి బాలకృష్ణ

బాలయ్యకు బ్రహ్మరథం

- అడుగడుగునా నీరాజనం పలికిన అభిమానులు, కార్యకర్తలు
- దారివెంబడి గజమాలలతో స్వాగతం
- పెదజాలరి పేట నుంచి ఆరిలోవ చివరి బస్టాప్ వరకూ రోడ్ షో

విశాఖపట్నం, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ నటుడు, తెలుగుదేశం పార్టీ ముఖ్య నేత, హిందూపురం శాసనసభ్యుడు నందమూరి బాలకృష్ణ నగర పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన రోడ్ షోకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. స్వర్ణాంధ్ర సాకార యాత్ర పేరుతో ఆయన రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా శుక్రవారం సాయంత్రం 4.30 గంటలకు తూర్పు నియోజకవర్గ పరిధిలోని పెదజాలరిపేట వద్ద నుంచి రోడ్ షో ప్రారంభించారు. బాలకృష్ణకు అభిమానులు, కార్యకర్తలు, ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. ఓపెన్ టాప్ జీపుపై నిలబడి బాలకృష్ణ ప్రజలకు అభివాదం చేసుకుంటూ ముందుకుసాగారు. పెదజాలరిపేట నుంచి లాసన్స్ బే కాలనీ మీదుగా ఎంవీపీ కాలనీ, సమతా కాలేజీ జంక్షన్, వెంకోజీపాలెం జంక్షన్, హనుమంతువాక, డెయిరీ ఫామ్ జంక్షన్, రవీంద్రనగర్ జంక్షన్, తోటగరువు, బాలాజీనగర్, ఆరిలోవ పోలీస్ జంక్షన్ మీదుగా ఆరిలోవ కాలనీ చివరి బస్టాప్ వరకు రోడ్ షో సాగింది. దారివెంబడి అశేష జనసందోహం, అభిమానులు ఆయనకు గజమాలలతో స్వాగతం పలికారు. ప్రతి జంక్షన్ వద్ద వందలాది మంది ఎదురువచ్చి స్వాగతం పలికారు. జై బాలయ్య...జైజై బాలయ్య నినాదాలతో రోడ్‌షో సాగిన ప్రాంతాలు మార్మోగాయి. బాలయ్యను చూసేందుకు పెద్దఎత్తున మహిళలు, యువత ఆయా జంక్షన్లు, కూడళ్ల వద్ద బారులుతీరారు. బాలయ్యపై పూలు చల్లుతూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనేకచోట్ల అభిమానంతో చంటి పిల్లలను బాలకృష్ణకు ఇవ్వగా..వారిని ఆప్యాయంగా తీసుకుని ముద్దుపెట్టి ఆశీర్వచనాలు అందిస్తూ ముందుకుసాగారు. ఆరిలోవ చివరి బస్టాప్ వద్ద రోడ్ షో ముగించిన బాలకృష్ణ అక్కడి నుంచి నేరుగా కంచరపాలెం మెట్టు వద్ద ఏర్పాటుచేసిన సభా ప్రాంగణానికి చేరుకున్నారు. సభ అనంతరం కంచరపాలెం మెట్టు నుంచి ఎన్ఏడీ మీదుగా గోపాలపట్నం జంక్షన్ వరకూ రోడ్ షో సాగింది. అక్కడి నుంచి ఎస్.కోట నియోజకవర్గ పరిధిలోని కొత్తవలసలో నిర్వహించిన సభలో పాల్గొనేందుకు ఆయన వెళ్లారు. రోడ్ షోలో బాలకృష్ణ వెంట కూటమి ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యే అభ్యర్థులు వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, విష్ణుకుమార్‌రాజు తదితరులు పాల్గొన్నారు. రోడ్ షోలో భాగంగా ఓపెన్ టాప్ వాహనంలో నిలబడి బాలకృష్ణ తనదైన శైలిలో చేసిన పలు విన్యాసాలు అభిమానులను అలరించాయి. మైక్ పైకి విసిరి పట్టుకోవడం, కళ్లద్దాలను తనదైన శైలిలో పైకి విసిరి జేబులో పడేలా చేయడం వంటివన్నీ చూసిన అభిమానులు పులకించిపోయారు. జై బాలయ్య నినాదాలతో హోరెత్తించారు.

జిల్లాలో 1,95,269 మంది ఖాతాల్లో నగదు జమ

అనకాపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో డైరెక్ట్ బెనిఫిసరీ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ)కింద శుక్రవారం సాయంత్రానికి 1,95,269 మంది (99.29 శాతం)కి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అయ్యిందని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) పీడీ శశీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 2,65,210 మంది పింఛన్‌దారులు ఉండగా, 1,97,790 మంది పింఛన్‌దారులకు డీబీటీ ద్వారా జమ చేయాల్సి ఉందన్నారు. శుక్రవారం సాయంత్రానికి 1,95,269 మందికి బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యిందన్నారు. బ్యాంకు లింకేజీ లేని 67,420 మంది పింఛన్‌దారులకు నేరుగా అందజేయాల్సి ఉండగా 64,850 (96.19 శాతం) మందికి ఇళ్లకు వెళ్లి నగదు అందించినట్టు తెలిపారు.

పారదర్శకంగా ఎన్నికలు నిర్వహణ

- సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితేష్‌వ్యాస్


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎన్నికల పరిశీలకులు దల్జీత్‌సింగ్ మంగత్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి తదితరులు

అనకాపల్లి కలెక్టర్, మే 3 : సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని భారత ఎన్నికల కమిషన్ సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితేష్‌వ్యాస్ ఎన్నికల అధికారులను ఆదేశించారు. నాల్గో దశ ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు సంబంధించి అధికారులతో శుక్రవారం ఆయన ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హింసాత్మక సంఘటనలు చోటుచేసుకోకుండా, రీ పోలింగ్‌కు తావులేకుండా పారదర్శక ఎన్నికల నిర్వహణకు అందరూ కృషి చేయాలని కోరారు. ఎన్నికల నిర్వహణలో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారుల శిక్షణ కీలకమని, ఈవీఎంలపై వారు పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరచాలని, వీడియోగ్రాఫీ కూడా చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల పరిశీలకులు దల్జీత్‌సింగ్‌మంగత్, జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్‌శెట్టి, ఎన్నికల సిబ్బంది హాజరయ్యారు. ఈసీ సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితేష్‌వ్యాస్ జిల్లాకు సంబంధించిన ఎన్నికల ఏర్పాట్లపై అడిగిన ప్రశ్నలకు ఎన్నికల పరిశీలకులు దల్జీత్‌సింగ్‌మంగత్ బదులిచ్చారు. అవసరమైన అన్ని ముందస్తు చర్యలను తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అబ్జర్వర్ రాకేష్‌కుమార్, ఎస్పీ కేవీ మురళీకృష్ణ, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ సమయాన్ని రెండు గంటలు పెంచండి

- ఎన్నికల సంఘానికి లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ లేఖ


కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలకు రాసిన లేఖను చూపుతున్న భీశెట్టి బాబ్జీ

కొత్తూరు, మే 3 : ఈనెల 13న జరగనున్న ఎంపీ, ఎమ్మెల్యేల సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సమయాన్ని రెండు గంటలు పెంచాలని కోరుతూ కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలకు లేఖ రాశానని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. శుక్రవారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో లేఖను విలేకరులకు విడుదల చేశారు. రాష్ట్రంలో ఎండల తీవ్రతను గుర్తించి ఎన్నికల సంఘం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఓటు వేయడానికి వచ్చే వృద్ధుల పరిస్థితిని అధికారులు అంచనా వేయాలన్నారు. ఏపీలో ఒక్కో పోలింగ్ కేంద్రంలో 1500 మందికి ఓటు వేసే అవకాశముందని, ఎండకు తట్టుకోలేక సాయంత్రం వచ్చే ఓటర్లతో పోలింగ్ కేంద్రాల వద్ద రద్దీ పెరిగేకొద్దీ సిబ్బందికి ఇబ్బందులు పెరుగుతాయన్నారు. అందుకే రెండు గంటల సమయాన్ని పెంచాలని కోరారు. ఇప్పటికే తెలంగాణలో ఒక గంట పెంచిందని బాబ్జీ గుర్తు చేశారు.

వలంటీర్ల ప్రవర్తనపై చర్యలు తీసుకోండి

రాష్ట్రంలో ఉన్న కొంతమంది వలంటీర్లు అధికార పార్టీకి ప్రచారం చేయడంలో భాగంగా బాధ్యత మరచి ప్రవర్తిస్తున్నారని, దీనిపై ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జనసేన నాయకుడు కనుబుడ్డి నరసింగరావు, పౌరవేదిక ప్రతినిధి కొలసాని రమణ, గ్రామీణ వైద్యుల సంఘం నాయకుడు ఆడారి శ్రీనివాసరావు, సాలాపు మధు పాల్గొన్నారు.

అప్పన్న చందనోత్సవంలో సామాన్యులకు అగ్రస్థానం

- రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ

సింహాచలం, మే 3 : సింహగిరిపై ఈనెల 10న జరిగే వరాహలక్ష్మీ నృసింహస్వామి నిజరూప దర్శనం చందనోత్సవంలో సామాన్య భక్తులకు అగ్రస్థానం కల్పిస్తామని దేవదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ సత్యనారాయణ, కలెక్టర్ మల్లికార్జున స్పష్టం చేశారు. శుక్రవారం వారు చందనోత్సవ ఏర్పాట్లపై ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి సారథ్యంలో విలేకరులతో మాట్లాడారు. గతేడాది తలెత్తిన సమస్యలు పునరావృతం కాకుండా ఈఏడాది పక్కా ప్రణాళికలు సిద్ధం చేసినట్టు తెలిపారు. చందనోత్సవం ముందు రోజు సాయంత్రం 6 నుంచి భక్తులకు దర్శనాలు నిలుపుదల చేస్తామని చెప్పారు. కొండపైకి బస్సులు నిలిపివేస్తామని, సొంత వాహనాల ద్వారా కాని, మెట్ల మార్గం ద్వారా కాని వచ్చే భక్తులను అనుమతించమని తెలిపారు. 10న తెల్లవారుజామున 1 గంటకు సుప్రభాత సేవ అనంతరం స్వామివారిపై ఏడాది పొడవునా పైపూతగా ఉన్న శ్రీచందనం ఉత్తరణ (తొలగింపు) జరిపిన తరువాత తొలుత ఆలయ అనువంశిక ధర్మకర్తకు, వారి కుటుంబ సభ్యులకు స్వామివారి దర్శనం కల్పిస్తామన్నారు. అనంతరం 4 గంటల నుంచి ఉచిత, రూ.300, రూ.1000 టికెట్ల భక్తులకు నీలాద్రి గుమ్మం నుంచి నిజరూప దర్శనం కల్పిస్తామన్నారు. రూ.1500 టికెట్లు తీసుకున్న వారికి ఉదయం 5.30 గంటల నుంచి నీలాద్రి గుమ్మం వద్ద నుంచి దర్శనాలు కల్పిస్తామని చెప్పారు. ఇదిలావుంటే, అప్పన్న నిజరూప దర్శనం చందనోత్సవం దర్శన టికెట్ల విక్రయాలను దేవదాయశాఖ కమిషనర్ ఎస్. సత్యనారాయణ శుక్రవారం సాయంత్రం సింహగిరిపై పాత పీఆర్‌ఓ కార్యాలయంలో ప్రారంభించారు. తొలి టికెట్‌ను ఆయన కొనుగోలు చేయగా ఈఓ శ్రీనివాసమూర్తి అందజేశారు. కాగా తొలిరోజు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచిన వెయ్యి టికెట్లు సెకన్ల వ్యవధిలో అమ్ముడయ్యాయి.

రోడ్డు ప్రమాదంలో వైద్య విద్యార్థి మృతి

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొనడంతో ప్రమాదం

మల్కాపురం, మే 3: ఆగి ఉన్న ట్రాక్టర్‌ను బైక్‌తో ఢీకొట్టిన ప్రమాదంలో ఓ వైద్య విద్యార్థి మృతిచెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన విశాఖనగరం సింధియా జంక్షన్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పల్నాడు జిల్లాకు చెందిన షేక్ జానీబాషా, అతని ఇద్దరి స్నేహితులు కొమ్మాదిలోని గాయత్రి వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరం చదువుతున్నారు. వీరు ముగ్గురూ ద్విచక్రవాహనంపై వేకువజామున మల్కాపురం నుంచి సింధియా మీదుగా నగరంలోకి వెళ్లేందుకు బయలుదేరారు. సింధియా జంక్షన్ వద్దకు వచ్చేసరికి ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొన్నారు. దీంతో షేక్ జానీబాషా అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. అపస్మారక స్థితిలో ఉన్న వీరిని ఆస్పత్రికి తరలించారు. వీరి వివరాలు తెలియరాలేదు. వేకువజామున ఈ ప్రాంతానికి ఎందుకు వచ్చి వెళుతున్నారో కూడా తెలియడం లేదని పోలీసులు చెబుతున్నారు. షేక్ జానీబాషా మృతి చెందిన విషయాన్ని పల్నాడులో ఉన్న కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు మల్కాపురం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. తమ కుమారుడు ఎంబీబీఎస్ ఫస్టియర్ చదువుతున్నట్టు షేక్ జానీబాషా తండ్రి పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూములు దోచేస్తున్న దుష్ట చతుష్టయం

... 5వ పేజీ తరువాయి

తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. వైసీపీ పాలకులు ప్రశాంతంగా ఉండే విశాఖ నగరాన్ని గంజాయి వనంగా మార్చేశారని దుయ్యబట్టారు. ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ ప్రజలను పాతాళంలోకి నెట్టాడన్నారు. ధరలు పెంచి ప్రజలపై ఆర్థిక భారాన్ని మోపుతున్నాడన్నారు. కోడికత్తి, బాబాయ్ గొడ్డలి, గులకరాయి డ్రామాలతో ప్రజలను మభ్యపెట్టే యత్నాన్ని జగన్మోహన్‌రెడ్డి చేస్తున్నాడన్నారు. మూడు రాజధానులంటూ నాటకాలాడిన జగన్..చివరికి ఒక్క రాజధాని కూడా లేకుండా చేశాడన్నారు. ఐదేళ్ల పాలనలో ప్రశ్నించే గొంతుకలను నొక్కడం, ఎదురుతిరిగిన వారిపై దాడులు చేయడం, ఆస్తులను ధ్వంసం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. జగన్‌ను ఇంటికి పంపించేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రం గాడిన పడాలంటే చంద్రబాబు అధికారంలోకి రావడం తప్పనిసరన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూర్చేవిధంగా మేనిఫెస్టో విడుదల చేశామన్నారు. కార్యక్రమంలో కూటమి ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యే అభ్యర్థులు వెలగపూడి రామకృష్ణబాబు (తూర్పు), గణబాబు (పశ్చిమ), విష్ణుకుమార్‌రాజు (ఉత్తరం) పాల్గొన్నారు. సభలో బాలకృష్ణ తనదైన శైలిలో డైలాగ్‌లు, మేనరిజంతో అభిమానులను అలరించారు. విశాఖలో అత్యధికంగా సినిమాలు షూటింగ్ చేశానని, తాను ఇక్కడ షూటింగ్ చేసినన్ని సినిమాలు మరే హీరో చేయలేదని స్పష్టం చేశారు. ఉత్తరాంధ్రకు వస్తే తనలోని నెత్తురు మరుగుతుందన్న మాటలకు సభకు హాజరైన ప్రజలు హర్షధ్వానాలు చేశారు.

క్రైం... crime news

తప్పుడు ఫిర్యాదు చేశాడనే మనస్థాపంతో యువకుడి ఆత్మహత్య

పాయకరావుపేట, మే 3: స్నేహితుడు తనపై పోలీసులకు తప్పుడు ఫిర్యాదు చేశాడని మనస్థాపానికి గురైన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని దుర్గాకాలనీకి చెందిన బంగారు సంతోష్‌కుమార్ ఈనెల 1వ తేదీ రాత్రి తన స్నేహితులతో కలిసి తుని పట్టణానికి వెళ్లి తిరిగి వస్తుండగా స్థానిక నాగరాజు పేట రైల్వే గేటు వద్దకు వచ్చేసరికి తన స్నేహితుడు గుడాల రాజేష్, మరో ఇద్దరు వ్యక్తులతో కలిసి వచ్చి తనను చంపుతానని బెదిరించాడు. మరలా రాత్రి 9.30కి ఇందిరాకాలనీలోని పార్కు వద్ద గుడాల రాజేష్ తనను కొట్టినట్టు సంతోష్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదుపై ఎస్‌ఐ జోగారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉంటే సంతోకుమార్ తనపై పోలీసులకు తప్పుడు ఫిర్యాదు చేశాడని తీవ్ర మనస్థాపానికి గురైన గూడాల రాజేష్ (22) గురువారం రాత్రి ఇంటి వద్ద ఉరివేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గుర్తించి రాజేష్‌ని తుని ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్‌ఐ జోగారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులు అప్పగించినట్టు పోలీసులు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో గిరిజన యువకుడు మృతి

- భీమవరంలోని రొయ్యల ఫ్యాక్టరీలో ఘటన
- మృతదేహాన్ని స్వగ్రామం పూలబంద తేవడంతో విషాదం


మృతుడు వెంకటరావు (ఫైల్ ఫొటో)

ముంచంగిపుట్టు, మే 3: విద్యుత్ షాక్‌కు గురై ఓ గిరిజన యువకుడు మృతిచెందాడు. ఇందుకు సంబంధించిన వివరాలివి. మండలంలోని కుమడ పంచాయతీ పూలబంద గ్రామానికి చెందిన కొర్రా వెంకటరావు(21) అనే గిరిజన యువకుడు తూర్పుగోదావరి జిల్లా భీమవరంలోని రొయ్యల ఫ్యాక్టరీలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. బుధవారం రొయ్యల చెరువులో పనులు చేస్తుండగా, ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ఫ్యాక్టరీ యాజమాన్యం ఆస్పత్రికి తరలించేలోపే వెంకటరావు మృతి చెందాడు. అంబులెన్స్‌లో మృతదేహాన్ని గురువారం రాత్రి ఫ్యాక్టరీ యాజమాన్యం పూలబంద గ్రామానికి తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించింది ఈ ఘటనపై గ్రామస్థులు, మృతుని బంధువులు ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని నిలదీశారు. మృతు డు వెంకటరావు చింతపల్లి ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చ దువుతున్నాడు. చదువుకుంటూనే కూలి పనులు చేస్తూ కుటుంబానికి అండగా నిలిచేవాడు. చేతికి అందివచ్చిన కొడుకు మృతితో ఆ కుటుంబం కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. వైస్ ఎంపీపీ సత్యనారాయణ, సీపీఎం మండల నాయకుడు ఎ.ఎం.శ్రీను బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ఆటో దగ్ధం

- రూ.3లక్షల ఆస్తినష్టం


వడ్డాదిలో దగ్ధమైన ఆటో

బుచ్చెయ్యపేట, మే 3: వడ్డాది చెరకు కాటా వద్ద గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో ఆటో దగ్ధమైంది. లోపూడికి చెందిన చొప్పా సతీష్ ఆటోలో పండ్లు వ్యాపారం చేస్తుంటారు. రోజులాగే కాటా వద్ద ఆటోను వదిలి వెళ్లారు. గురువారంఅర్ధరాత్రి సమయంలో ఆటో దగ్ధమవుతున్నట్టు స్థానికులు సమాచారం ఇవ్వడంతో వెంటనే సతీష్ సంఘటనా స్థలానికి చేరుకుని చోడవరం అగ్నిమాపక కేంద్రం సిబ్బందికి సమాచారమిచ్చారు. వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. అప్పటికే ఆటో పూర్తిగా దగ్ధం కావడంతో రూ.3లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్టు బాధితుడు తెలిపాడు. దీనిపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఇరువర్గాలపై హత్యాయత్నం కేసు

అనకాపల్లి టౌన్, మే 3: స్థానిక విజయరామరాజుపేట పరిసరాల్లో ఒకటో తేదీ రాత్రి జరిగిన సంఘటనలకు సంబంధించి ఇరువర్గాలపైన హత్యాయత్నం కేసులు నమోదు చేసినట్టు పట్టణ ఎస్‌ఐ వి. సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. గాంధీనగరం మొదటివీధిలో ఏడిద ఆదర్స్, అతని స్నేహితుడు భాను మాట్లాడుకుంటుండగా బొమ్మల మహేష్, ఎం.పండు, సింగంపల్లి మహేష్, ఎం.మహేష్ వచ్చి మారణాయుధాలతో కొట్టి ద్విచక్ర వాహన సైలెన్సర్‌పై కాలు పెట్టి తీవ్ర గాయాలు అయ్యాలా చేసి హతమార్చేందుకు ప్రయత్నించారని ఆదర్స్ తల్లి ఝాన్సీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు. అలాగే ఏఎంసీ కాలనీకి చెందిన మధు అనే వ్యక్తి ఫోన్ చేసి గుండాల జంక్షన్‌కు సమీపాన నన్ను కొందరు కొడుతున్నారని తనకు తెలిపారని నీలాపు నూకఅప్పారావు ఫిర్యాది చేశారన్నారు. నూకఅప్పారావు అక్కడికి వెళ్లి సంఘటనను వీడియో తీయడానికి ప్రయత్నించగా.. ఆదర్స్, భాను, శివ, డాన్ అనే నలుగురు తనపై తిరగబడి చంపడానికి ప్రయత్నించి కులం పేరుతో అవమానించారని నూకఅప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.

విశాఖ తూర్పు వైసీపీ అభ్యర్థి, ఎంపీ ఎంవీవీ ఇంటిపై ఎన్నికల ఫ్లయింగ్ బృందాల దాడి

- కొనసాగుతున్న సోదాలు


ఎంపీవీ సత్యనారాయణ ఇంటి వద్ద ఎన్నికల నిఘా బృందాలు, పోలీసులు

పెదవాల్తేర్ (విశాఖపట్నం), మే 3: విశాఖపట్నం ఎంపీ, తూర్పు నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ ఇంటిపై ఎన్నికల ప్రవర్తన నియమావళి ఫ్లయింగ్ బృందాలు శుక్రవారం రాత్రి దాడి చేశాయి. రాత్రి 7.40 గంటలకు ఒక బృందం లాసన్స్‌బే కాలనీలోని ఎంవీవీ ఇంటికి వచ్చింది. ఎన్నికల ప్రచారంలో ఉన్న ఎంవీవీ ఫ్లయింగ్ స్క్వాడ్ వచ్చిన విషయం తెలుసుకుని తొమ్మిది గంటల సమయంలో ఇంటికి చేరుకున్నారు. ఆయన వెంట మరో బృందం ఉంది. ఆ తరువాత 9.40 గంటలకు ఇంకో బృందం అక్కడికి చేరుకుంది. మొత్తం మూడు బృందాలు, పోలీసులతో కలిసి సుమారు 25 మంది సోదాలు చేస్తున్నారు. ఎంవీవీ ఇంట్లోకి బయటవారిని ఎవరినీ అనుమతించకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. సోదాలు చేస్తున్న సమయంలో ఎంవీవీ సన్నిహితుడు, వైసీపీ నేత అయిన జీవీ కూడా ఉన్నట్టు చెబుతున్నారు. ఎంవీవీ భవనం నాలుగు అంతస్థులతో ఉంది. ఇందులో రెండు అంతస్థుల్లో ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకున్న బృందాలు, అక్కడ ఉన్న వ్యక్తులను ప్రశ్నించినట్టు తెలిసింది. దాడులు పూర్తయ్యేసరికి మరికొంత సమయం పడుతుందని సమాచారం.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	123.00
లైవ్ ధర	143.00
విత్ స్కిన్	256.00
స్కిన్ లెస్	266.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454


అనకాపల్లి వ్యూ

అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో సైకిల్ జోరు

- నియోజకవర్గానికి ఇప్పటివరకూ 15 సార్లు ఎన్నికలు
- ఆరు పర్యాయలు విజయ ఢంకా మోగించిన టీడీపీ
- నాలుగు సార్లు కమ్యూనిస్టులు...

మొత్తం ఓటర్లు	2,10,897
పురుషులు	1,01,744
మహిళలు	1,09,148
ఇతరులు	5

- కాంగ్రెస్ రెండుసార్లు, ప్రజారాజ్యం, వైసీపీ ఒక్కొక్కసారి గెలుపు
- ఈసారి కూటమి, వైసీపీ మధ్య పోటీ


కొడగంటి గోవిందరావు


భీశెట్టి అప్పారావు


పీవీ రమణ


రాజా కన్నబాబు

కమ్యూనిస్టుల కంచుకోటలో టీడీపీ పాగా

ఒకప్పుడు కమ్యూనిస్టుల కంచుకోటగా ఉన్న అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో క్రమంగా తెలుగుదేశం పార్టీ పాగా వేసింది. 1983లో తొలిసారిగా కమ్యూనిస్టులతో పోటీపడి విజయఢంకా మోగించింది. ఆ తరువాత అదే ఊపు కొనసాగించింది. అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి ఇప్పటివరకూ 15 సార్లు ఎన్నికలు జరగ్గా ఆరు పర్యాయాలు తెలుగుదేశం పార్టీ గెలుపొందింది. సీపీఐ నాలుగు పర్యాయాలు, కాంగ్రెస్ రెండుసార్లు, ప్రజారాజ్యం, వైసీపీ ఒక్కొక్కసారి విజయం సాధించాయి.

అనకాపల్లి శాసనసభ నియోజకవర్గానికి 1952లో ఎన్నికలు నిర్వహించారు. ఆ ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థి కె.గోవిందరావు ఎన్నికయ్యారు. ఆ తరువాత 1955లో జరిగిన ఎన్నికల్లో కమ్యూనిస్టులను ఓడించడానికి మిగతా పార్టీలు అన్ని జట్టుకట్టాయి. అప్పుడు కృషికార్ లోక్‌పార్టీ తరఫున పోటీ చేసిన భీశెట్టి అప్పారావు ఎన్నికయ్యారు. ఆ తరువాత సీపీఐ తరఫున 1962, 1967 ఎన్నికల్లో మళ్లీ గోవిందరావు ఎన్నికయ్యారు. 1972లో జరిగిన ఎన్నికల్లో సమీకరణలు మారాయి. కమ్యూనిస్టు పార్టీలో గోవిందరావు, పీవీ రమణ ముఖ్య నేతలు. కాగా గోవిందరావును అసెంబ్లీకి పంపగా ఇతర పదవులకు రమణను ఎంపిక చేసేవారు. ఈ విధంగా రమణను 1951లో జిల్లా బోర్డు సభ్యుడిగా, 1958లో ఎమ్మెల్సీగా పార్టీ ఎంపిక చేసింది. దీన్ని వ్యతిరేకించిన రమణ ఎమ్మెల్యేగా పోటీ చేయాలని నిర్ణయించుకున్నారు. 1962 ఎన్నికల్లో గోవిందరావును అనకాపల్లి నుంచి, రమణను కొండకర్ల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేలుగా పోటీకి నిలిపారు. ప్రస్తుతం అచ్యుతాపురం మండలంలో వున్న కొండకర్ల ఆనాడు అసెంబ్లీ నియోజకవర్గంగా ఉండేది. ఈ ఎన్నికల్లో ఇద్దరు నేతలు విజయం సాధించారు. 1972 ఎన్నికల నాటికి నియోజకవర్గ పునర్విభజనలో భాగంగా కొండకర్లను తొలగించారు. అనకాపల్లి ఒక్కటే మిగిలింది. ఆదినుంచీ అనకాపల్లి నుంచి గోవిందరావు ప్రాతినిధ్యం వహిస్తున్నందున పార్టీ రమణకు అవకాశం ఇవ్వలేదు. సీపీఐలో అంతర్గత కలహాలను కాంగ్రెస్ పార్టీ తనకు అనుకూలంగా మార్చుకుంది. సీపీఐ తరఫున గోవిందరావు పోటీ చేయగా, కాంగ్రెస్ తరుఫున రమణ పోటీ చేసి 6,893 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 1978లో జరిగిన ఎన్నికల్లో తిరిగి సీపీఐ తరఫున కె.గోవిందరావు పోటీ చేసి జనతా పార్టీ అభ్యర్థి పీవీ చలపతిరావుపై గెలుపొందారు.


దాడి వీరభద్రరావు


కొణతాల రామకృష్ణ


గంటా శ్రీనివాసరావు


పీలా గోవింద


గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లి నియోజకవర్గం విజేతలు వీరే

సంవత్సరం	విజేత	పార్టీ	మెజారిటీ	ప్రత్యర్థి
1952-1955	కొడుగంటి గోవిందరావు	సీపీఐ	6,622	విల్లూరి వెంకటరమణ (కేఎల్‌పీ)
1955-1962	భీశెట్టి అప్పారావు	కేఎల్‌పీ	664	కొడుగంటి గోవిందరావు (సీపీఐ)
1962-1967	కొడుగంటి గోవిందరావు	సీపీఐ	11,750	బి.వి.నాయుడు (కాంగ్రెస్)
1967-1972	కొడుగంటి గోవిందరావు	సీపీఐ	8,295	బి.వి.నాయుడు (కాంగ్రెస్)
1972-1978	పి.వి.రమణ	కాంగ్రెస్	7,893	కె.గోవిందరావు (సిపీఐ)
1978-1983	కె.గోవిందరావు	సీపీఐ	8,437	పి.వి.చలపతిరావు (జతతా పార్టీ)
1983-1985	రాజా కన్నబాబు	టీడీపీ	25,384	మళ్ళ లక్ష్మీనారాయణ (కాంగ్రెస్)
1985-1989	దాడి వీరభద్రరావు	టీడీపీ	29,541	నిమ్మదల సత్యనారాయణ (కాంగ్రెస్)
1989-1994	దాడి వీరభద్రరావు	టీడీపీ	2,258	దంతులూరి దిలీప్‌కుమార్ (కాంగ్రెస్)
1994-1999	దాడి వీరభద్రరావు	టీడీపీ	1,655	దంతులూరి దిలీప్‌కుమార్ (ఇండిపెండెంట్)
1999-2004	దాడి వీరభద్రరావు	టీడీపీ	3,671	కొణతాల రామకృష్ణ (కాంగ్రెస్)
2004- 2009	కొణతాల రామకృష్ణ	కాంగ్రెస్	17,033	దాడి వీరభద్రరావు (టీడీపీ)
2009- 2014	గంటా శ్రీనివాసరావు	ప్రజారాజ్యం	10,866	కొణతాల రామకృష్ణ (కాంగ్రెస్)
2014-2019	పీలా గోవింద సత్యనారాయణ	టీడీపీ	22,341	కొణతాల రఘునాథ్ (వైసీపీ)
2019-2024	గుడివాడ అమర్‌నాథ్	వైసీపీ	8,169	పీలా గోవింద సత్యనారాయణ (టీడీపీ)

టీడీపీ ఆవిర్భావం తరువాత జైత్రయాత్ర....

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తరువాత అనకాపల్లి నియోజకవర్గంలో కమ్యూనిస్టుల స్పీడుకు బ్రేకులు పడ్డాయి. క్రమంగా నియోజకవర్గంలో కమ్యూనిస్టులు తమ ఉనికిని కోల్పోయారు. టీడీపీ హవా కొనసాగింది. 1983లో జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థి రాజా కన్నబాబు గెలుపొందారు. ఆ తరువాత జరిగిన పరిణామాల్లో కన్నబాబు నాదెండ్ల వర్గంలో చేరడంతో అప్పట్లో ఏఎంఏఎల్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న దాడి వీరభద్రరావు తెలుగుదేశంలో చేరారు. ఆయన వరుసగా నాలుగుసార్లు (1985, 1989, 1994, 1999) విజయం సాధించారు. ఆయన రికార్డును ఇప్పటివరకూ ఎవరూ అధిగమించలేకపోయారు. 2004 ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున కొణతాల రామకృష్ణ, 2009 ఎన్నికల్లో ప్రజారాజ్యం తరఫున పోటీ చేసిన గంటా శ్రీనివాసరావు, 2014 ఎన్నికల్లో తెలుగుదేశం తరఫున పీలా గోవింద సత్యనారాయణ, 2019లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ తరఫున గుడివాడ అమర్‌నాథ్ గెలుపొందారు. అనకాపల్లి ఎమ్మెల్యేగా వరుసగా నాలుగుసార్లు దాడి వీరభద్రరావు ఎన్నికయ్యారు. 1985 నుంచి 1999 వరకు దాడి ఎమ్మెల్యేగా పనిచేశారు. ఈసారి ఎన్నికల్లో కూటమి (టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా) తరఫున కొణతాల రామకృష్ణ, వైసీపీ నుంచి మలసాల భరత్‌కుమార్ తలపడుతున్నారు. అనకాపల్లి కోటలో ఎవరు పాగా వేస్తారో చూడాలి.

● కొత్తూరు (అనకాపల్లి)


అక్కడ ఒకసారి ఓడితే అంతే సంగతులు

ఇదీ మాడుగుల సెంటిమెంట్

- దొండా శ్రీరామ్మూర్తి నుంచి గవిరెడ్డి రామానాయుడు వరకూ అందరిదీ అదేవరుస


కురచా రామునాయుడు


రెడ్డి సత్యనారాయణ


కరణం ధర్మశ్రీ

మాడుగుల నియోజకవర్గంలో ఒకసారి గెలిచి ఎమ్మెల్యే అయినవారు మరుసటి ఎన్నికల్లో ఓటమి చవిచూసినట్టయితే గనుక ఇక అంతే సంగతులు. తిరిగి ఆ స్థానానికి అందుకోలేకపోతున్నారు. చీడికాడ మండలానికి చెందిన రెడ్డి సత్యనారాయణ మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మంత్రిగా పనిచేశారు. అలాగే దేవరాపల్లి మండలం తారువ గ్రామానికి చెందిన బూడి ముత్యాలనాయుడు రెండుసార్లు ఎమ్మెల్యే గా ఎన్నికై విప్‌గా, రాష్ట్ర మంత్రిగా పనిచేసే అవకాశం దక్కింది.

1955లో జరిగిన ఎన్నికల్లో వడ్డాదికి చెందిన దొండా శ్రీరామ్మూర్తి తన సమీప ప్రత్యర్థి తెన్నే టి విశ్వనాథంపై గెలుపొంది తొలిసారి ఎమ్మె ల్యే అయ్యారు. 1962లో జరిగిన ఎన్నికల్లో తెన్నేటి విశ్వనాథం చేతిలో దొండా శ్రీరా మ్మూర్తి ఓటమి చవిచూశారు. 1967లో మాడుగుల మహారాణి రమాకుమారిదేవి గెలుపొందగా, 1972లో బొడ్డు కళావతి అదే నియోజకవర్గం నుంచి గెలుపొందారు. 1978లో కురచా రామునాయుడు స్వతం త్ర అభ్యర్థిగా పోటీ చేసి ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి గుమ్మాల ఆదినారాయణపై గెలు పొందారు. అనంతరం 1985, 89 ఎన్ని కల్లో పోటీ చేసిన కురచా రామునా యుడు రెండుసార్లు రెడ్డి సత్యనారా యణ చేతిలో ఓటమి చెందారు. తరు వాత ఆయనకు పోటీ చేసే అవకాశం కలగలేదు. 1983, 85, 89, 94, 99 ఎన్నికల్లో పోటీ చేసిన రెడ్డి సత్యనారా యణ తన ప్రత్యర్థులపై గెలుపొం దారు. రాష్ట్ర మంత్రిగాను పనిచేశారు. అయితే 2004 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కరణం ధర్మశ్రీ చేతిలో రెడ్డి సత్యనారాయణ ఓటమిచెందారు. ఆ తరువాత ఎన్నికల్లో ఆయనకు ఎక్కడా పోటీ చేసేందుకు అవకాశం కలగ లేదు. 2009 ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీచేసిన గవి రెడ్డి రామానాయుడు ప్రత్యర్థి అవుగడ్డ రామ్మూర్తి నాయుడుపై గెలుపొంది తొలిసారి ఎమ్మెల్యే అయ్యారు. అయితే 2014, 2019 ఎన్నికల్లో రామానాయుడు పోటీ చేసినా వైసీపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు చేతిలో ఓటమి చవిచూశారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో టీడీపీ టికెట్ కోసం రామానాయుడు విస్తృతంగా ప్రయత్నించినా దక్కలేదు. అంటే నియోజకవర్గంలో ఒకసారి ఓడిన తరువాత మళ్లీ ఎమ్మెల్యేలుగా గెలుపొందలేకపోయారు. మాడుగుల నియోజకవర్గంలో ఇదొక సెంటిమెంట్‌గా తయారయ్యింది.

● చీడికాడ



మరో ఛాన్స్ ఇస్తే ప్రమాదమే



ఒక్క ఛాన్స్ అని అధికారంలోకి వచ్చిన వారు మరో ఛాన్స్ అడగడంలో అర్థంలేదు. ప్రజలను నమ్మించి నట్టేట ముంచిన నాయకులను ఓటుద్వారా తిరస్కరిద్దాం. పాలకులుగా వ్యవహరించే వారు కాకుండా ప్రజలకు సేవచేయాలను కునే వారిని గుర్తించి ఓటు వేయాలి. చట్టసభలకు పోటీ చేసే అభ్యర్థుల్లో సేవాభావం ఉన్నవారినే ఎన్నుకుందాం. సంపాదన కోసం వెంపర్లాడే వారితో ఎప్పుడూ ప్రమాదమే.

\- శిలపర శెట్టి, అనకాపల్లి

ఓటువిలువ పెంచుదాం



సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల్లో సమర్థులకు ఓటు వేసి ఓటు విలువ పెంచుదాం. బహిరంగ సభల్లో మాట్లాడే వాటిలో పదిశాతం అయినా చట్టసభల్లో మాట్లాడగలిగే వారిని ఎన్నుకోవాలి. చట్టసభల్లో నిద్రపోవడం, దుమ్మెకొట్టేవారితో ఎటువంటి ప్రయోజనం ఉండదు. అధికారం ఉన్నా లేకున్నా ప్రజల మధ్య ఉండి, సమస్యల పరిష్కారానికి కృషిచేసే సమర్థత ఉన్న నాయకులను గెలిపించుకుందాం.

\- డి.గురునాథరావు, అక్కయ్యపాలెం

స్టీల్‌ప్లాంట్‌ను రక్షించే వారికే ఓటు



స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటు పరం కాకుండా అడ్డుకుంటామని మాటిచ్చిన పార్టీకే ఓటువేయాలి. మొహమాటంలేకుండా ప్లాంట్ పరిరక్షణకు హామీ ఇచ్చిన నేతలనే ఎన్ను కుందాం. అన్ని వర్గాల ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజా సమస్యలను గాలికొదిలేసే వారిని తిరస్కరిద్దాం. ఆలోచించి మరీ ఓటువేయాలి.

\- జి.శ్యామ్‌కుమార్, గోపాలపట్నం

విజన్ ఉన్న నాయకుడు కావాలి



విజన్ ఉన్న నేతను ఎన్నుకుంటనే రాష్ట్రానికి మేలు. విశాఖను ఐటీ హబ్‌గా మార్చి ఉపాధి కల్పన జరగాలి రాష్ట్రంలో సంపద సృష్టించగల నాయకులను ఎన్నుకోవాలి. సార్వత్రిక ఎన్నికల తరుణంలో ప్రజలంతా ఒక్కసారి ఆలోచించి ఓటు వేయాలి.

\- జి.సాయిసంపత్, గోపాలపట్నం

ఎన్నికల వేడి మొద ▶ మీరూ పంపించండి

లయ్యింది. పార్టీలు, అభ్యర్థులు సమరాంగణానికి సిద్ధమవుతున్నారు. ఎటువంటి వారు అధికారంలోకి రావాలని మీరు కోరుకుంటున్నారు? పాలకులు ఎలా ఉండాలనుకుం టున్నారు?, ఏం చేయాలని కోరుకుంటున్నారు? ...అభిప్రాయం ఏదైనా మీ మనసులో మాట మాతో పంచుకోండి. దాన్ని 'ఆంధ్రజ్యోతి' పాఠకుల ముందుంచుతాం. ఇంకెందుకు ఆలస్యం మీ అభిప్రాయాన్ని, ఫోటోతో సహా ఈ నంబరుకు వాట్సాప్ చేయండి.

వాట్సాప్ నంబర్ ... 9848212243

19,26,390

- ఇదీ విశాఖ పార్లమెంటు నియోజకవర్గ ఓటర్ల సంఖ్య
- బరిలో 33 మంది అభ్యర్థులు
- మొత్తం పోలింగ్ కేంద్రాలు 1,962
- విశాఖ పార్లమెంటుకు 7,063 ఈవీఎంలు అవసరం
- శ్రీకాకుళం, రాజమండ్రి నుంచి ఈవీఎంలు సమీకరణ
- కొత్త ఈవీఎంల ర్యాండమైజేషన్ పూర్తి

విశాఖపట్నం, మే 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అత్యధికంగా విశాఖ పార్లమెంటు స్థానానికి 33 మంది ఎన్నికల బరిలో ఉన్నారు. దీంతో ప్రతి పోలింగ్ బూత్‌లో మూడు ఈవీఎంలు (ఒక్కో ఈవీఎంలో 16 పేర్లకు మాత్రమే అవకాశం ఉంటుంది) ఏర్పాటుచేయాల్సి ఉంటుంది. పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో విశాఖ జిల్లాలోని ఆరు అసెంబ్లీ స్థానాలతోపాటు విజయనగరం జిల్లాలోని శృంగవరపుకోట...మొత్తం ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నాయి. పార్లమెంటు పరిధిలో సింహభాగం నగర పరిధిలో ఉండడంతో ఓటర్ల సంఖ్య కూడా భారీగానే ఉంది. తాజా గణాంకాల మేరకు విశాఖ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో మొత్తం 19,26,390 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 9,48,008, మహిళలు 9,78,261, ట్రాన్స్‌జండర్లు 121 మంది ఉన్నారు. పురుషుల కంటే మహిళలు 30,253 మంది ఎక్కువగా ఉన్నారు. రాష్ట్రంలో మూడు లక్షల ఓటర్లు దాటిన అసెంబ్లీ సెగ్మెంట్లు ఐదు ఉండగా...అందులో రెండు (భీమిలి, గాజువాక) విశాఖ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోనే ఉన్నాయి. ఎన్నికల నిర్వహణకు మొత్తం 1962 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. అత్యధికంగా భీమిలి నియోజకవర్గంలో 359, తక్కువగా విశాఖ పశ్చిమలో 222 కేంద్రాలు ఏర్పాటుచేశారు. పార్లమెంటు నియోజక వర్గానికి 33 మంది పోటీ చేస్తున్నందున ప్రతి పోలింగ్ కేంద్రంలో మూడు ఈవీఎంలు ఏర్పాటుచేయాల్సి ఉంది. దీనికి అనుగుణంగా 1,962 పోలింగ్ కేంద్రాలకు 5,886 ఈవీఎంలు ఏర్పాటుచేస్తున్నారు. దీనికి అదనంగా 20 శాతం అదనంగా సిద్ధంగా చేసుకోవాలన్న నిబంధనల మేరకు మరో 1177 మిషన్లు రెడీ చేశారు. దీంతో మొత్తం 7,063 ఈవీఎంలు సమకూర్చారు. జిల్లాలో 500 వరకు అదనపు ఈవీఎంలు ఉండగా, మరో 4500 ఈవీఎంలను రాజమండ్రి, శ్రీకాకుళం జిల్లా నుంచి తెప్పించారు. ఇప్పటికే పార్లమెంటు పరిధిలో ఈవీఎంల కేటాయింపుపై ర్యాండమైజేషన్ పూర్తిచేసిన అధికారులు కొత్తగా సమీకరించిన ఈవీఎంల ర్యాండమైజేషన్ శుక్రవారం నిర్వహించారు.



పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఓటర్లు


నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	ట్రాన్స్‌జండర్లు	మొత్తం
భీమిలి	359	1,78,068	1,84,928	17	3,63,013
విశాఖ తూర్పు	293	1,42,546	1,49,639	21	2,92,206
విశాఖ దక్షిణ	237	1,06,454	1,10,282	34	2,16,770
విశాఖ ఉత్తర	275	1,40,810	1,44,956	23	2,85,789
విశాఖ పశ్చిమ	222	1,05,207	1,08,221	11	2,13,439
గాజువాక	306	1,67,125	1,66,473	13	3,33,611
ఎస్.కోట	270	1,07,798	1,13,762	02	2,21,562
మొత్తం	1,962	9,48,008	9,78,261	121	19,26,390

- నాటి నుంచి నేటి వరకూ ప్రతి ఎన్నికల్లోనూ మండల వాసుల పోటీ

కొయ్యూరులో నేతలకు కొదవ లేదు

- ఎంపీలుగా, ఎమ్మెల్యేలుగా పలువురి ఎన్నిక

రాజకీయంగా కొయ్యూరు మండలానికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. స్వాతంత్ర్య వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకూ మండలానికి చెందిన వారు ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తూనే ఉన్నారు. ఎంతోమంది శాసనసభ్యులుగా ఎన్నికయ్యారు.


గాం మల్లుదొర


ఎంవీవీ సత్యనారాయణ


గొడ్డేటి దేముడు


మాధవి

బ్రిటీష కబంధ హస్తాల నుంచి దేశాన్ని, భారతీయులను బంధవిముక్తులను చేసేందుకు స్వాతంత్ర్య ఉద్యమం నడిపిన అల్లూరి సీతారామరాజుతో ముందుకు నడిచిన గాం మల్లుదొర మండలంలోని నడింపాలెం శివారు దిబ్బలవీధికి చెందినవారు. ఆయన దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన అనంతరం అప్పటి గిరిజన కోటాలో ఎంపీగా ఎన్నికయ్యారు. మండలంలోని మంప గ్రామానికి చెందిన ఇంగువ రామన్నపడాల్ ఇక 1972లో ఇండియన్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అనంతరం 1978లో కాంగ్రెస్ పార్టీ రెండుగా చీలింది. కాంగ్రెస్ (ఐ) తరఫున శరభన్నపాలేనికి లోకుల కన్నాలుకు చింతపల్లి నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు అవకాశం లభించింది. అప్పటిలో రెడ్డి కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన చింతపల్లి మండలానికి చెందిన దేపూరి కొండలరావు చేతిలో కన్నాలు పరాజయం పాలయ్యారు. అనంతరం 1983లో పార్టీ టికెట్ లభించకపోవడంతో కన్నాలు ఇండిపెండెంట్‌గా పోటీ చేసి మరో దఫా ఓటమి చవిచూసారు. అనంతరం 1985లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా కొయ్యూరు గ్రామానికి చెందిన ఎంవీవీ సత్యనారాయణ చింతపల్లి నియోజకవర్గం పోటీ చేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1989 ఎన్నికల్లో పొత్తుతో భాగంగా చింతపల్లి సీటును సీపీఐకి తెలుగుదేశం పార్టీ కేటాయించింది. సీపీఐ అభ్యర్థిగా అప్పటి సమితి అధ్యక్షుడు మండలంలోని మాల మాకవరం గ్రామానికి చెందిన కొర్రు మల్లయ్య పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి పసుపులేటి బాలరాజు చేతిలో ఓటమి పాలయ్యారు. తిరిగి 1994 ఎన్నికల్లో పొత్తు కొనసాగడంతో చింతపల్లి సీటును తిరిగి సీపీఐకు కేటాయించగా మండలంలో శరభన్నపాలేనికి చెందిన ఉపాధ్యాయుడు గొడ్డేటి దేముడు పోటీ చేసి సిట్టింగ్ ఎమ్మెల్యే బాలరాజుపై విజయం సాధించారు. అనంతరం 1999లో తెలుగుదేశం పార్టీ టిక్కెట్ తిరిగి ఎంవీవీ సత్యనారాయణకు దక్కడంతో ఇదే మండలానికి చెందిన సీపీఐ అభ్యర్థి దేముడుపై విజయం సాధించి రెండో దఫా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2004లో చింతపల్లి నియోజకవర్గం నుంచి ఎన్నికల బరిలో సీపీఐ తరఫున గొడ్డేటి దేముడు, తెలుగుదేశం పార్టీ తరఫున చల్లంగి జ్ఞానేశ్వరి పోటీ చేయగా, తెలుగుదేశం పార్టీ రెబల్ అభ్యర్థిగా ఇండిపెండెంట్‌గా ఎంవీవీ బరిలోకి దిగారు. ఈ ఎన్నికల్లో సీపీఐ తరఫున బరిలో ఉన్న దేముడును విజయం వరించింది. అనంతరం చింతపల్లి నియోజకవర్గాన్ని రద్దు చేసి 2009లో పాడేరు నియోజకవర్గంలో విలీనం చేశారు. 2009 ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థి దేముడుపై కాంగ్రెస్ అభ్యర్థి పసుపులేటి బాలరాజు స్వల్ప మెజారిటీతో విజయం సాధించారు. అనంతరం 2014 ఎన్నికల్లో జరిగిన ఎన్నికల్లో తిరిగి గొడ్డేటి దేముడు సీపీఐ తరఫున తిరిగి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో శరభన్నపాలెం గ్రామానికి చెందిన లోకుల కన్నాలు వారసుడిగా లోకుల గాంధీ (ఎన్ఆర్ఐ) బీజేపీ తరఫున పోటీ చేసి ఓటమి చవిచూశారు. అలాగే ఇదే గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే గొడ్డేటి దేముడు వారసురాలిగా గొడ్డేటి మాధవి అరకులోయ పార్లమెంటరీ నియోజకవర్గ అభ్యర్థిగా వైసీపీ తరఫున బరిలో నిలిచి గెలుపొందారు.

● కొయ్యూరు

మండిన సూరీడు

- వేడి గాలులతో జనం ఉక్కిరిబిక్కిరి
- నిర్మానుష్యమైన రహదారులు



నిర్మానుష్యంగా ఉన్న అచ్యుతాపురం రోడ్డు

అచ్యుతాపురం, మే 3: సూర్యుడు శుక్రవారం మండిపోయాడు. ఉదయం ఏడు గంటల నుంచే చుర్రుమనిపించాడు. పది గంటలకు రోడ్లపైకి ఎవరూ రాని పరిస్థితి ఏర్పడింది. అచ్యుతాపురం, మోసయ్యపేటల్లో జరిగే సంత వెలవెలపోయింది. మోసయ్యపేటలో జరిగే సంతలో ఎక్కువగా కూరగాయలు విక్రయిస్తారు. ఎండలు విపరీతంగా కాస్తుండడంతో రైతులు శుక్రవారం ఉదయం ఐదు గంటలకే గంపలు, బస్తాలతో కూరగాయలు తెచ్చి విక్రయించి 8 గంటలకు ఇళ్లకు వెళ్లిపోయారు. అచ్యుతాపురం సంతలో పశువులు, కోళ్లు, మేకల విక్రయాలు పది గంటలకల్లా పూర్తయ్యాయి. అచ్యుతాపురం జంక్షన్ ఉదయం 11 గంటల నుంచి వెలవెలపోయింది.

సబ్బవరంలో.. మండలంలో శుక్రవారం వాతావరణం నిప్పుల కొలిమిని తలపించింది. ఉదయం 7 గంటల నుంచే భానుడు ప్రతాపం చూపడంతో ప్రజలు ఎండ తీవ్రతకు ఉక్కిరిబిక్కిరయ్యారు. ఎండ తీవ్రతకు వేడి గాలులు తోడవడంతో ప్రజలు అల్లాడిపోయారు. రైతులు, వ్యవసాయ కూలీలు రోజువారీ పనులు చేసుకునేందుకు అవస్థలు పడ్డారు. వృద్ధులు, చంటి పిల్లలు వడగాడ్పులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మధ్యాహ్నం 4 గంటలకు ఎండ తీవ్రతతో పాటు తీవ్రమైన ఉక్కపోత కొనసాగింది. ఎండ తీవ్రతకు ప్రజల రాకపోకలు బందవడంతో మండల కేంద్రం నిర్మానుష్యంగా మారింది.

వైభవంగా కల్యాణ వినాయక ఆలయ వార్షికోత్సవం



వినాయకునికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాంబిల్లి, మే 3 : మండలంలోని పంచదార్లలో కల్యాణ వినాయక మందిరం 14వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వేదపండితులు కల్యాణ వినాయకునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అనంతరం సిద్ధిబుద్ధి సమేత కల్యాణ వినాయక కల్యాణోత్సవాన్ని వైభోగంగా నిర్వహించారు. భగవత్ భక్తి ప్రచార ట్రస్టు కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి దంపతులు, డాక్టర్ శ్రీనివాసశాస్త్రి దంపతులు, శాస్త్రవేత్త బండి నాగేంద్రప్రసాద్ దంపతులు స్వామివారి కల్యాణంలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

స్కౌట్స్, గైడ్స్‌లో సెయింట్ జాన్స్ విద్యార్థులు ప్రతిభ

కశింకోట, మే 3 : ఏప్రిల్ 25 నుంచి మే 1 వరకు మధ్యప్రదేశ్‌లో జరిగిన జాతీయ స్థాయి అడ్వంచెర్ ప్రోగ్రామ్‌లో సెయింట్ జాన్స్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని స్కూల్ ప్రిన్సిపాల్ రూపనంది తెలిపారు. భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్కూలులో పదో తరగతి చదువుతున్న పి.మహేష్, ఎన్.కళ్యాణ్‌కుమార్, బి. ప్రియాంక, జి.ప్రియుష పాల్గొని ప్రతిభ కనబరిచారని చెప్పారు. ప్రతిభ కనబరిచిన వారికి ప్రోగ్రాం ఇన్‌చార్జి బిలికిష్ షేక్ చేతుల మీదుగా ప్రసంశాపత్రాన్ని అందజేశారని ఆమె తెలిపారు. ఈ ప్రతిభ పట్ల జిల్లా గైడ్ కమిషనర్ జి.ఉమ, అసిస్టెంట్ కమిషనర్ జీసీహెచ్.నాగేశ్వరరావు, స్కూలు కరస్పాండెంట్ బత్తుల అనురాధ విద్యార్థులను అభినందించారు.

యాదవులకు అన్యాయం చేసిన వైసీపీ

టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాబూరావు



సమావేశంలో మాట్లాడుతున్న బాబూరావు

కొత్తూరు, మే 3 : వైసీపీ ప్రభుత్వ హయాంలో యాదవులకు అన్యాయం జరిగిందని టీడీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు భరణికాన బాబూరావు అన్నారు. శుక్రవారం స్థానిక యాదవ సంక్షేమ సంఘం భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల విజయానికి యాదవులంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. టీడీపీ స్థాపించినప్పటి నుంచి రాష్ట్రంలోని యాదవులు ఆ పార్టీకి అన్ని వేళలా అండగా నిలిచారని గుర్తు చేశారు. ఉమ్మడి విశాఖ నుంచి యాదవ సంఘ నేతలు వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ (జనసేన), పల్లా శ్రీనివాస్ (టీడీపీ)లకు ఉమ్మడి పార్టీ నేతలు సీట్లను కేటాయించారన్నారు. వీరిద్దరినీ అధిక మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. కనీసం ఒక్క స్థానాన్ని కూడా వైసీపీ కేటాయించకపోవడం పట్ల మండిపడ్డారు. ఈ సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకుడు భరణికాన నరసింహమూర్తి, జిల్లా ఉపాధ్యక్షుడు వియ్యపు సింహాచలం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేటలో హోమ్ ఓటింగ్ ప్రారంభం



హోమ్ ఓటింగ్‌కు బ్యాలెట్ బాక్సులను తరలిస్తున్న ఎన్నికల సిబ్బంది

నక్కపల్లి/ పాయకరావుపేట/ ఎస్.రాయవరం/ కోటవురట్ల, మే 3: పాయకరావుపేట నియోజకవర్గంలోని నక్కపల్లి, పాయకరావుపేట,ఎస్.రాయవరం, కోటవురట్ల మండలాల్లో శుక్రవారం హోమ్ ఓటింగ్ ప్రారంభమైంది. కదల్లేని ఓటర్లు, 85 ఏళ్ల వయస్సు గల ఓటర్ల కోసం ఎన్నికల సంఘం ఈ ఏడాది నుంచి హోం ఓటింగ్ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. నియోజకవర్గంలో 217 మంది వృద్ధులైన ఓటర్లకు హోం ఓటింగ్‌కు అర్హులయ్యారు. ఇందుకు సంబంధించి ఏడు బృందాలకు ఆర్వో కె.గీతాంజలి హోమ్ ఓటింగ్ సామగ్రి అందజేశారు. నక్కపల్లిలో తహసీల్దార్ శ్రీకాంత్, ఎలక్షన్ డీటీ చైనులు ఆధ్వర్యంలో తొలిరోజు 16 మంది ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకున్నారు. పాయకరావుపేట మండలంలో 54 మంది హోం ఓటింగ్‌కు అర్హులు కాగా తొలి రోజు 14 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. మండలంలో రెండు బృందాలు హోం ఓటింగ్‌ను నిర్వహించాయని ఏఆర్‌వో సూర్యనారాయణ తెలిపారు. ఎస్.రాయవరం మండలంలో 32 మంది ఓటర్లు ఉన్నారు. తొలి రోజు సోముదేవుపల్లి, ధర్మవరం అగ్రహారం, ఎస్.రాయవరం గ్రామాలకు చెందిన ఏడుగురు వృద్ధులు, దివ్యాంగులు ఓటుహక్కును వినియోగించుకున్నట్టు ఏఆర్‌వో జయలక్ష్మి తెలిపారు. కోటవురట్ల మండలంలో హోం ఓటింగ్‌కు 36 మంది అర్హులు ఉండగా..ఆరుగురు ఓటుహక్కును వినియోగించుకున్నారు.

యాదవుల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తాం

- బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రమేశ్

అచ్యుతాపురం, మే 3: తెలుగుదేశం పార్టీకి యాదవులు పట్టుకొమ్మలని బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ అన్నారు. శుక్రవారం అచ్యుతాపురంలో జరిగిన ఎలమంచిలి నియోజకవర్గ యదవ మహాసభలో ఆయన మాట్లాడుతూ కూటమి అధికారంలోకి రాగానే వీరికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులు ద్వారా యాదవుల ఆర్థికాభివృద్ధికి కృషిచేస్తానన్నారు. టీడీపీ ఎలమంచిలి ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. యాదవుల అభివృద్ధి టీడీపీ హయాంలోనే జరిగిందన్నారు. జనసేన ఎలమంచిలి అభ్యర్థి సుందరపు విజయకుమార్ మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం యాదవులను విస్మరించిందన్నారు. సమావేశంలో యాదవ సంఘం అధ్యక్షుడు భరణికాన బాబూరావు, దూళి రంగనాయకులు, పుర్రే శ్రీనివాసయాదవ్, చొప్ప శ్రీను, గొలగాని అప్పారావు, కొయ్య శ్రీను, వియ్యపు నానాజీ పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి ప్రాధాన్యం

మత్స్యకారుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తామని బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్, జనసేన ఎలమంచిలి అభ్యర్థి సుందరపు విజయకుమార్ అన్నారు. గురువారం రాత్రి పూడిమడకలో జరిగిన ఎన్నికల ప్రచారంలో వారు మాట్లాడుతూ.. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రతిపాదించిన పూడిమడక హార్బర్ జగన్ రెడ్డి ఐదేళ్లపాలనలో కనీసం శంకుస్థాపన చేయలేకపోయారన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పూడిమడక హార్బర్ నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. మరపడవలు, వలలు కొనుగోలుకు సబ్సిడీపై రుణాలు మంజూరు చేయిస్తామన్నారు. అలాగే రాయితీపై డీజిల్ సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు చేపడతామన్నారు. మత్స్యకారులు వేట నిషేధ సమయంలో రూ.20వేలు జీవన భృతి ఇస్తామన్నారు. సెజ్ కర్మాగారాల్లో మత్స్యకార యువకులకు ఉపాధి కల్పించడానికినికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు. ఇద్దరికీ గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ ఎలమంచిలి ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ లాలం భవానీ భాస్కర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్, పూడిమడక నాయకులు మేరుగు ప్రవీణ్ కుమార్, బాపునాయుడు, కాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తుకు టీడీపీ విజయం అవసరం

- టీడీపీ పాయకరావుపేట అభ్యర్థిని వంగలపూడి అనిత



సుంకపూర్‌లో మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థిని వంగలపూడి అనిత

కోటవురట్ల, మే 3: రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తుకు టీడీపీ విజయం చారిత్రక అవసరమని టీడీపీ పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థిని వంగలపూడి అనిత అన్నారు. శుక్రవారం సుంకపూర్, జల్లూరు, బీకేపల్లి, రామచంద్రపాలెం, జి. సన్యాసిరాజుపాలెం, నీలిగుంట, పాములవాక, బోడపాలెం గ్రామాల్లో ఆమె ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మహిళలు హారతులిచ్చి అనితకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ పాలనలో అరాచకం రాజ్యమేలిందని, నిరుద్యోగ సమస్య పెనుభూతంలా ఆవహించిందన్నారు. సూపర్ సిక్స్ పథకాల ద్వారా రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు జానకి శ్రీనివాసరావు, నాయకులు వేచ్చలపు జనార్దన్, పెట్ల లింగంనాయుడు, జనసేన మండల అధ్యక్షుడు సింగంపల్లి శ్రీనివాసరావు, నాయకులు చీటికల భాస్కరరావు పాల్గొన్నారు.

నమూనా బ్యాలెట్‌తో ఎన్డీఏ కూటమి ప్రచారం

పాయకరావుపేట/రూరల్, మే 3 : ఎన్నికల్లో బీజేపీ అనకాపల్లి ఎంపీగా పోటీ చేస్తున్న సీఎం.రమేశ్‌కు కమలం గుర్తుపైనా. టీడీపీ పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థిని వంగలపూడి అనితకు సైకిల్ గుర్తుపైనా ఓట్లు వేసి గెలిపించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు తోట నగేశ్, టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ పార్టీ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెల రాజబాబు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం పట్టణంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించిన కూటమి నాయకులు అభ్యర్థుల నమూనా బాలెట్‌తోపాటు సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు యాళ్ల వరహాలబాబు, మజ్జూరి నారాయణరావు, గూటూరు శ్రీనివాసరావు, జనసేన నాయకులు దేవవరపు రఘు, ఆచంట దొర, వేముల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని పెదరాంభద్రపురం కొత్తూరులో శుక్రవారం కూటమి నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొర్రెల రాజబాబు, కలిగట్ల శ్రీనివాసరావు, గొల్లపల్లి నాగు పాల్గొన్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి.. సమస్యలు పరిష్కరిస్తా..

- యాత, శెట్టిబలిజ ఆత్మీయ సమావేశంలో సుందరపు



సమావేశంలలో మాట్లాడుతున్న సుందరపు విజయకుమార్

రాంబిల్లి, మే 3 : తనకు ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం ఇస్తే.. అధికారంలోకి వచ్చిన వెంటనే మీ సమస్యలన్నింటిని పరిష్కరించేందుకు కృషిచేస్తానని జనసేన ఎలమంచిలి ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్ అన్నారు. శుక్రవారం హరిపురం జనసేన కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ యాత, శెట్టిబలిజ కులస్థుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో గీత కార్మికులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే కన్నబాబురాజు గీతకార్మికులకు చేసింది ఏమి లేదన్నారు. కన్నబాబురాజు చెప్పే మాయ మాటలు విని మరోమారు మోసపోవద్దన్నారు.ఎమెల్యే అభ్యర్థిగా తనకు గాజుగ్లాస్‌పైన, బీజేపీ ఎంపీ అభ్యర్థిగా సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. అంతకుముందు విజయకుమార్ యాత, శెట్టిబలిజ నాయకులను పరిచయం చేసుకొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా యాత, శెట్టి బలిజ నాయకులు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో గీత కార్మికులకు ఎంతో మేలు జరిగిందన్నారు. అనంతరం యాత, శెట్టిబలిజ కుల సంఘ నాయకులు విజయకుమార్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు యాంద్ర సత్తిబాబు, వి. శ్రీనివాసరావు, కర్రి వెంకటరమణ, వడిశన సన్యాసినాయుడు, యాంద్ర పైడిరాజు, సుందరపు సత్యనారాయణ, యాత, శెట్టిబలిజ నాయకులు పాల్గొన్నారు.

జగన్‌కు ఇవే చివరి ఎన్నికలు

జనసేన పెందుర్తి అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు



అజనగిరిలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న రమేశ్‌బాబు

పెందుర్తి, మే 3: ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని దోచేసిన సీఎం జగన్‌కు ఇవే చివరి ఎన్నికలు అని జనసేన పార్టీ పెందుర్తి నియోజకవర్గ అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. 88వ వార్డు పరిధిలోని వెదుళ్ల నరవ, నరవ ప్రాంతాల్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజలందరూ మార్పు కోరుకుంటున్నారని, అందువల్ల కూటమి విజయం తథ్యమన్నారు. పెందుర్తి తనకు తల్లిలాంటిదని,రాజకీయ జన్మనిచ్చిన పుట్టినగడ్డలాంటి నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. ఎమ్మెల్యేగా తనను, అనకా పల్లి బీజేపీ ఎంపీగా సీఎం రమేశ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. కాగా అడుగడుగునా పంచకర్లకు మహిళలు హారతులిచ్చి, పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు, నాయకులు ఒబ్బిన శ్రీకాంత్, ఇందల రమణ, తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించాలి

సబ్బవరం: రాష్ట్ర భవిష్యత్తు కోసం కూటమి అభ్య ర్థులను గెలిపించాలని జనసేన పెందుర్తి అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు కోరారు. మండలంలోని నంగినారపాడు, అజనగిరి, గంగవరం ప్రాంతాల్లో చేపట్టిన ప్రచార కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్లలో రాష్ట్రం ఇరవై ఏళ్లు వెనక్కి పోయిందని, ఏపీ మళ్లీ గాడిలో పెట్టే సత్తా చంద్రబాబుకే ఉంద న్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసమే జనసేన, టీడీపీ, బీజేపీ కూటమిగా ఏర్పడ్డాయన్నారు. కూటమి మేనిఫెస్టోతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుం దన్నారు. సామాజిక పింఛన్లు రూ.నాలుగు వేలు, దివ్యాంగుల పెన్షన్లు రూ.ఆరు వేలు అందుతుందని, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఫ్రీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,మహిళలకు నెలకు రూ.1,500, తదితర పథకాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయ న్నారు. కార్యక్రమంలో నాయకులు ఇందలి వెంకటరమణ, కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు, ఎం.దేముడు, గొర్లి రమణ, రాజాన పైడిరాజు, దాసరి రమణ, బొబ్బరి కన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో పలువురు చేరిక

మండలంలోని చినబంగారమ్మపాలేనికి చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు శెట్టిబలిజ సంఘం నాయకుడు తాటిపాముల శేఖర్ ఆధ్వర్యంలో జనసేన పార్టీలో చేరారు. వారికి పంచకర్ల రమేశ్‌బాబు సోదరుడు వెంకటేశ్వరరావు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు టి.శేఖర్, కర్రి కనకరాజు, బీఏ రావు, ఎస్.రాము, కన్నంనాయుడు, బంతికోళ్ల పద్మ, శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి పలువురు జనసేనలో చేరిక



జనసేన కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న పంచకర్ల రమేష్‌బాబు

పరవాడ, మే 3 : ఈ.బోనంగి ఉపసర్పంచ్ మేడిశెట్టి వెంకటరావు, మాజీ ఉపసర్పంచ్ బొద్దపు అర్జున నరసింగరావుతో పాటు మరికొంత మంది వైసీపీ నుంచి జనసేన పార్టీలో శుక్రవారం చేరారు. వీరందరికీ జనసేన పెందుర్తి అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. జనసేనలోకి చేరిన వారిలో రాయి నీలబాబు, బొండ తారకరమేష్‌కుమార్, మేడిశెట్టి శంకరరావుతో పాటు మరికొంతమంది చేరారు. కార్యక్రమంలో సర్పంచ్ బొద్దపు శ్రీనివాసకాసులు తదితరులు పాల్గొన్నారు.

అజినోమోటో బయో ఫార్మాలో ప్రమాదం

... 5వ పేజీ తరువాయి

పనిచేశారు. రాత్రి పది గంటలకు డ్యూటీ ముగించుకుని ఇళ్లకు వెళ్లిపోయారు. గురువారం రాత్రి 11 గంటల తరువాత ఆ ఐదుగురు కార్మికులకు హఠాత్తుగా గొంతునొప్పి రావడంతో స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. వెంటనే కుటుంబ సభ్యులు పరిశ్రమ సెక్యూరిటీ సిబ్బందికి సమాచారమిచ్చారు. ఆ ఐదుగురిని కంపెనీ యాజమాన్యం శుక్రవారం ఉదయం విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించింది. ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగానే ఉంది. అయితే విషవాయువు ఎలా లీకైందనేది తెలియరాలేదు. ప్రమాదాన్ని కంపెనీ యాజమాన్యం గోప్యంగా ఉంచడం పలు అనుమానాలకు తావిస్తున్నది. కాగా ప్రమాద విషయంపై శుక్రవారం సాయంత్రం పోలీసులకు సమాచారం వచ్చింది. సమాచారం మేరకు సీఐ బాల సూర్యారావు కంపెనీని సందర్శించి ప్రమాదానికి గల కారణాలను యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పండుటాకులకు అవే పాట్లు

... 5వ పేజీ తరువాయి

ఇబ్బంది పడ్డారు. అలాగే కొందరి ఖాతాలు మనుగడలో లేకపోవడంతో ఎంతో కొంత నగదు డిపాజిట్ చేయాలని బ్యాంకు సిబ్బంది చెప్పడంతో తమ వద్ద నగదు లేక వృద్ధులు ఇబ్బంది పడ్డారు. మండలానికి చెందిన నాలుగు గిరిజన పంచాయతీల లబ్ధిదారులు ఆటోల్లో ఉదయం 8 గంటలకే బ్యాంకుల వద్దకు చేరుకున్నారు. అనంతగిరి మండలానికి చెందిన నాలుగు గిరిజన పంచాయతీల గిరిజనుల ఖాతాలు దేవరాపల్లి బ్యాంకుల్లో ఉన్నాయి. వారు బ్యాంకు లావాదేవీలు జరపకపోవడంతో ఖాతాలు మనుగడలో లేవు. దీని వల్ల రెండు రోజులుగా బ్యాంకులకు వచ్చిన వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. కాగా చోడవరంలో అన్ని బ్యాంకులు పింఛన్ లబ్ధిదారులతో శుక్రవారం కిటకిటలాడాయి. పట్టణంలోని ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకుల సేవా కేంద్రాల వద్ద కొందరు లబ్ధిదారులు డబ్బులు తీసుకుంటుండగా, మరికొందరు బ్యాంకులకు పరుగులు తీశారు. చాలామంది తమతో పాటు కుటుంబ సభ్యులను వెంట బెట్టుకుని మండుటెండలో బ్యాంకులకు వచ్చారు. గొలుగొండ మండలం ఏఎల్‌పురం, పాతకృష్ణాదేవిపేట, చోద్యం, నాగాపురం, కొంగసింగి తదితర గ్రామాల్లో బ్యాంకులు, బ్యాంకు సేవా కేంద్రాలు వద్ద వృద్ధులు పడిగాపులు కాశారు. గొలుగొండ మండల కేంద్రంలో గల ఎస్‌బీఐ బ్రాంచి వద్ద వృద్ధులు పింఛన్ సొమ్ము కోసం బారులు తీరారు. గొలుగొండ మండలానికి చెందిన 25 గ్రామాలు, అల్లూరి సీతారామరాజు జిల్లాకు కొయ్యూరు మండలానికి చెందిన ఎనిమిది గ్రామాల లబ్ధిదారులకు ఈ బ్రాంచిలో ఖాతాలు ఉన్నాయి. వీరంతా ఉదయాన్నే బ్యాంకుకు వచ్చి పడిగాపులు కాశారు. నర్సీపట్నంలో పింఛన్‌దారులతో బ్యాంకులు రద్దీగా కనిపించాయి. పింఛన్ నగదు కోసం వృద్ధులు ఉదయాన్నే బ్యాంకుల వద్ద వేచి ఉన్నారు. గంటల తరబడి పడిగాపులు కాసి మండుటెండలో తిరుగుముఖం పట్టారు.

మండుటెండలో అవస్థలు పడ్డా..



నాకు సరిగా కనిపించదు, వినిపించదు. నిలవలేని స్థితిలో బ్యాంకు వద్దకు ఆటోలో వచ్చాను. మండుటెండలో అవస్థలు పడుతున్నాం. గత నెలలో మాదిరిగా సచివాలయం వద్ద ఇచ్చినా బాగుండేది.

- కె.మహాలక్ష్మి, రైవాడ

టీడీపీలో చేరిన తగరంపూడి వైసీపీ నేతలు



టీడీపీలో చేరిన వైసీపీ నేతలకు కండువా వేసిన రత్నాకర్

అనకాపల్లి టౌన్, మే 3 : మండలంలోని తగరంపూడి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు శుక్రవారం టీడీపీలో చేరారు. స్థానిక డీవీఆర్ కార్యాలయంలో వారందరికీ టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో గ్రామానికి చెందిన ఎన్. తిరుపతిరాజు, పాకలపాటి సురేష్‌బాబు, నందవరపు కుమార్, కె. సుబ్రహ్మణ్యం గుప్తా ఆధ్వర్యంలో వార్డు మెంబర్లు, యువకులు చేరారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రానుందని, కార్యకర్తలంతా క్షేత్రస్థాయిలో పార్టీ అభివృద్ధికి పాటు పడాలన్నారు.

ఘనంగా ఇంటక్ ఆవిర్భావ దినోత్సవం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎన్టీపీసీ సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా

పరవాడ, మే 3 : సింహాద్రి ఎన్టీపీసీకి చెందిన దీపాంజలినగర్‌లో శుక్రవారం ఇంటక్ 78వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సింహాద్రి ఎన్టీపీసీ సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత ఆయన ఇంటక్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. వందమందికి పైగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో సింహాద్రి వివిధ విభాగాల జీఎంలు ఎస్‌జె డేవిడ్, టీబీ పాత్ర, సీఐఎస్‌ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ వి. ప్రభాకర్, సింహాద్రి సీఎంఓ కె. విజయ, ఇంటక్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంజేపీ లెనిన్, జనరల్ సెక్రటరీ భీమరాజు, లక్ష్మి, యూనియన్ కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

‘కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం’

పరవాడ, మే 3 : కూటమి అభ్యర్థుల విజయం సాధిస్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందని మాజీ ఎంపీపీ పైలా జగన్నాథరావు అన్నారు. శుక్రవారం రావాడ పంచాయతీ పరిధిలోని ఉపాధి కూలీలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జనసేన పెందుర్తి నియోజకవర్గ అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబుకు గాజుగ్లాసు గుర్తుపైన, బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, పంచకర్ల ప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న, సర్పంచ్ మోటూరి సన్యాసినాయుడు, సారిపల్లి జోగినాయుడు పాల్గొన్నారు.

ప్రాంగణ నియామకాల్లో సత్తా చాటిన డైట్ విద్యార్థులు

అనకాపల్లి టౌన్, మే3: స్థానిక డైట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎస్.4 ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో కళాశాల విద్యార్థులు అద్భుత ప్రదర్శన కనబరిచి ప్లేస్‌మెంట్ సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. వైకుంఠరావు తెలిపారు ఎస్4 ప్రైవేట్ లిమిటెడ్‌లో బిమ్ (బిల్డింగ్ ఇన్ఫర్మేషన్ మోడలింగ్) ఇంజినీరుగా ఆఫర్ లెటర్లు అందుకున్నారన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం జరిగిన అభినందన సభలో చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ కోర్ ఇంజినీరింగ్ అయిన సివిల్, ఎలక్ట్రికల్ విద్యార్థులకు ఆధునిక ప్రపంచంలో ఎక్కువ ప్రాముఖ్యత ఉందన్నారు.

మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి

- వడ్డే శోభనాద్రీశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు

అనకాపల్లి టౌన్, మే 3 : సహజ వనరులను దేశ ప్రజల సౌభాగ్యానికి ఉపయోగించకుండా కొద్దిమంది కార్పొరేటర్ల చేతుల్లో పెడుతున్న ప్రధాని మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక రోటరీ కల్యాణ మండపంలో రాజ్యాంగ పరిరక్షణ వేదిక సదస్సు ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధానకార్యదర్శి అజశర్మ అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సులో శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. విభజన హామీలను అమలు చేయలేని మోదీని టీడీపీ, జనసేన, వైసీపీ అంటకాగుతున్నారన్నారు. పరిరక్షణ కో-కన్వీనర్ విజయరావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ పాలనలో అసమానతలు, నిరుద్యోగం పెరిగిందన్నారు. ఈ సమావేశంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి బి. శ్రీనివాస్‌ప్రసంగించారు. ఈ సందర్భంగా నయవంచన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వేగి వెంకటేష్, ఎమ్మెల్యే అభ్యర్థులు, సీపీఎం నాయకులు ఎం.అప్పలరాజు, గంటా శ్రీరామ్, సీపీఐ నాయకులు బి. వెంకటరమణ, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కన్వీనర్ పీఎస్ అజయ్‌కుమార్, ఆమ్ ఆద్మీ నాయకులు రమేష్ పాల్గొన్నారు.

గ్రామాల్లో కేంద్ర బృందాలు కవాతు

అచ్యుతాపురం, మే 3: మండలంలోని దొప్పెర్ల, పూడిమడక, మడుతూరు, సెజ్ పునరావాస కాలనీల్లో కేంద్ర బలగాలు శుక్రవారం కవాతు నిర్వహించాయి. రాజస్థాన్‌కి చెందిన 90 మంది ఇండియన్ టిబెట్ బోర్డర్ బలగాలు ఎన్నికల కోసం ఇక్కడకు వచ్చాయి. వీరిని సమస్యాత్మక ప్రాంతాల్లో బందోబస్తుకు ఏర్పాటు చేస్తామని సీఐ బుచ్చిరాజు తెలిపారు.

ఏపీఈపీడీసీఎల్ ఏఈపై దాడి

ఎలమంచిలి, మే 3: మండలంలోని గూండ్రుబిల్లిలో శుక్రవారం విధులు నిర్వహించేందుకు వెళ్లిన ఈపీడీసీఎల్ ఏఈ సీహెచ్. కనకరాజుపై గ్రామానికి చెందిన ముగ్గురు విధులకు ఆటంకం కలిగించడంతో పాటు కంటిలో కారం చల్లిన ఘటనపై ఏఈ ఫిర్యాదు చేసినట్టు రూరల్ ఎస్ఐ సింహాచలం తెలిపారు. విద్యుత్ లైను పనులు చేపట్టేందుకు వెళ్లిన ఏఈపై దాడి చేసిన వై.రమణ, అతని కుమారుడు, కుమార్తెలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

45 మద్యం సీసాలు స్వాధీనం

పరవాడ, మే 3 : మండలంలోని ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన అల్లు మసేనమ్మ శుక్రవారం రాత్రి వాడచీపురుపల్లి ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి 45 మద్యం క్వార్టర్ బాటిళ్లు కొనుగోలు చేసి తీసుకువెళ్తుండగా పట్టుకున్నట్టు ఎస్ఐ మల్లేశ్వరరావు తెలిపారు. ఆమె వద్ద మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితురాలపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ మల్లేశ్వరరావు తెలిపారు.

తాగునీటి సమస్యపై మహిళల నిరసన

రాంబిల్లి, మే 3: మండలంలోని నేవీ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ మహిళలు శుక్రవారం పాడైన బోరు వద్ద బిందెలతో నిరసన తెలిపారు. ఐదేళ్లుగా నీటి సమస్య ఉన్నా అధికారులుగాని, పాలకులు గాని కనీసం పట్టించుకోకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని మహిళలు తెలిపారు. రక్షిత నీటి పథకం సక్రమంగా పనిచేయకపోవడంతో తాగునీటికి కష్టాలు పడాల్సి వస్తున్నదని మహిళలు ఆవేదన వ్యక్తంచేశారు. నేవీ కాలనీలో పలుచోట్ల చేతిబోర్లు పనిచేయడం లేదన్నారు. అధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

నర్సీపట్నం
నియోజకవర్గం

పలు గ్రామాల్లో వర్షం


కృష్ణాదేవిపేటలో వర్షంపడుతున్న దృశ్యం

గొలుగొండ, మే 3: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం మధ్యాహ్నం వర్షం కురిసింది. మండలంలోని గొలుగొండ, చీడిగుమ్మల, కొత్తఎల్లవరం, గుండుపాల, పాకలపాడు, ఏటిగైరంపేట, రావణాపల్లి, జోగంపేట, కొత్తమల్లంపేట గ్రామాల్లో మధ్యాహ్నం వాతావరణం మారి ఉరుములతో కూడిన వర్షం పడింది. దీంతో వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఊరట చెందారు.

కృష్ణాదేవిపేటలో.. గొలుగొండ మండలంలో ఏఎల్‌పురం, కొంగశింగి, సీహెచ్.నాగాపురం, పల్లావూరు, పాతకృష్ణాదేవిపేట, చోద్యం, లింగంపేట తదితర గ్రామాల్లో శుక్రవారం సాయంత్ర భారీ వర్షం పడింది. ఉదయం నుంచి ఎండతో అల్లాడిన ప్రజలకు వర్షంతో ఉపశమనం పొందారు.

కొత్తఎల్లవరంలో పోలీసుల కవాతు



పోలీసులు కవాతు నిర్వహిస్తున్న దృశ్యం

గొలుగొండ, మే 3: మండలంలోని కొత్తఎల్లవరం, గొలుగొండ, చీడిగుమ్మల, పాకలపాడు గ్రామాల్లో శుక్రవారం ప్రత్యేక పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ కృష్ణారావు మాట్లాడుతూ ఈనెల 13వ తేదీన నిర్వహించే సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఓటర్లు సహకరించాలని కోరారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి : ఎంపీపీ

మాకవరపాలెం, మే3: గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు ఎంపీపీ సత్యనారాయణ సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రుత్తల సత్యనారాయణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వేసవి ఎండలు మండుతున్న తరుణంలో గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. అలాగే ఉపాధి పనులు చేసే చోట కూలీలకు తాగునీరు, ఎండకు నీడను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో చంద్రరరావు, అధికారులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా నర్సీపట్నం అభివృద్ధి : అయ్యన్న

నర్సీపట్నం, మే 3 : మునిసిపాలిటీని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తానని మాజీ మంత్రి, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అయ్యన్నపాత్రుడు అన్నారు. శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా పెదబొడ్డేపల్లిలో మూడో రోజు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, నాయకులు పార్టీ జెండాలు, బెలూన్స్ పట్టుకొని ఆయన వెంట నడిచారు. ప్రజలు ఆయనకు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. పూల వర్షం కరిపించి, మహిళలు హారతులు పట్టారు. అలాగే పెదబొడ్డేపల్లి జయంతి కాలనీ, మాదిక పేట చెందిన మంజేటి చిన్నబ్బాయి, తాతపూడి రాజు, మొర్తా సత్యనారాయణమూర్తి, పెదపూడి ఎర్రినమ్మ, పెదపూడి నాగేశ్వరరావు, తదితరులు వైసీపీ కార్యకర్తలు సీహెచ్ పద్మావతి, విజయ్ సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి ఆమె కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.


పెదబొడ్డేపల్లిలో పాదయాత్ర చేస్తున్న అయ్యన్నపాత్రుడు

సిమెంట్ బస్తాలు మాయం చేసిన వైసీపీ నేతపై చర్యలేవీ

నాతవరం : సరుగుడు గ్రామంలో సచివాలయ నిర్మాణానికి ఉపయోగించే రెండు వేల సిమెంట్ బస్తాలను ఓ వైసీపీ నాయకుడు మాయం చేయడంతో సచివాలయ నిర్మాణ పనులు పూర్తికాలేదని టీడీపీ నర్సీపట్నం అభ్యర్థి అయ్యన్నపాత్రుడు అన్నారు. ఎన్నికల శంఖారావంలో భాగంగా సరుగుడు, రామన్నపాలెం గ్రామాలలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా సరుగుడు గ్రామంలో అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ సరుగుడు సచివాలయం నిర్మాణానికి సంబంధించి రెండు వేల సిమెంట్ బస్తాలు మాయం చేసినవారిపై చర్యలు తీసుకోవాలని మండల సమావేశంలో ఎంపీపీ లక్ష్మణమూర్తి పేర్కొన్న విషయాన్ని అయ్యన్నపాత్రుడు ప్రస్తావించారు. ఈ ఎన్నికలే తనకు చివరి ఎన్నికలని, ఎమ్మెల్యేగా గెలిపిస్తే నర్సీపట్నం నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. అనంతరం కొంతమంది వైసీపీ నాయకులు అయ్యన్నపాత్రుడు సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో మండల నాయకులు, స్థానిక సర్పంచ్ గంగరాజు, నాయకులు చిన్న, పట్టెం రాజుబాబు పాల్గొన్నారు.

రెండో రోజూ వృద్ధులకు అవే కష్టాలు

నర్సీపట్నం, మే 3 : బ్యాంకులలో పింఛన్ సొమ్ము కోసం వచ్చిన వృద్ధులకు రెండో రోజు శుక్రవారం కూడా అవే కష్టాలు వెంటాడాయి.మునిసిపాలిటీలో మొత్తం 7,248 మంది లబ్ధిదారులకుగాను 5,443 మందికి బ్యాంకు ఖాతాలలో జమ చేసిన విషయం తెలిసిందే. నడవ లేని స్థితిలో ఉన్న 1,805 మంది లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది ఇళ్లకు వెళ్లి అందజేస్తున్నారు. పింఛను డబ్బులు డ్రా చేయడానికి బ్యాంకులకు వస్తున్న వృద్ధులు నానా అవస్థలు పడుతున్నారు. బ్యాంక్ ఖాతాకు ఆధార్ అనుసంధానం లేకపోవడం, చాలా కాలంగా నగదు లావాదేవీలు జరపకపోవడం వంటి కారణాలతో బ్యాంకుల వద్ద ఇబ్బందులు పడ్డారు. డీబీటీ ద్వారా బ్యాంకులో డబ్బులు జమ కాని 148 మంది లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన పనిలేదని, సచివాలయ సిబ్బంది ద్వారా పంపిస్తామని కమిషనర్ రవిబాబు తెలిపారు.

గొలుగొండలో.. స్థానిక ఎస్‌బీఐ వద్ద పింఛన్ల సొమ్ము తీసుకునేందుకు వృద్ధులు బారులు తీశారు. గొలుగొండ మండలానికి చెందిన 25 గ్రామాలు, కొయ్యూరు మండలానికి చెందిన ఎనిమిది గ్రామాలకు చెందిన పింఛనుదారులకు ఎస్‌బీఐలో ఖాతాలు ఉన్నాయి. పింఛన్ల సొమ్ము తీసుకునేందుకు రెండో రోజు లబ్ధిదారులు బారులు తీరారు. కొంతమంది లబ్ధిదారులకు ఏఎల్.పురంలోని ఇండియన్ బ్యాంకు ఖాతాల్లో నగదు పడిందని బ్యాంకు సిబ్బంది తెలపడంతో ఎండలో ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వం తీరుపై వృద్ధులు మండిపడ్డారు.


గొలుగొండ ఎస్‌బీఐ వద్ద పింఛను నగదు కోసం బారులు తీరిన వృద్ధులు

కృష్ణాదేవిపేటలో.. గొలుగొండ మండలం ఏఎల్‌పురం, పాతకృష్ణాదేవిపేట, చోద్యం, నాగాపురం, కొంగసింగి తదితర గ్రామాల్లో పింఛన్ సొమ్ము కోసం వృద్ధులు బ్యాంకులు, బ్యాంకు సేవా కేంద్రాల వద్ద నానా కష్టాలు పడ్డారు. ప్రభుత్వం పింఛన్ నేరుగా సచివాలయ ఉద్యోగులతో గత నెలలో పంపిణీ చేయగా ఈనెల బ్యాంకుల్లో జమ చేయడంతో వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీనికి తోడు బ్యాంకుల్లో ఆధార్ లింకు కాలేదని, పలుమార్లు బ్యాంకులు చుట్టూ ప్రదక్షిణలు తప్పడం లేదు.

పండుటాకులకు అవే పాట్లు

... 5వ పేజీ తరువాయి

ఇబ్బంది పడ్డారు. అలాగే కొందరి ఖాతాలు మనుగడలో లేకపోవడంతో ఎంతో కొంత నగదు డిపాజిట్ చేయాలని బ్యాంకు సిబ్బంది చెప్పడంతో తమ వద్ద నగదు లేక వృద్ధులు ఇబ్బంది పడ్డారు. మండలానికి చెందిన నాలుగు గిరిజన పంచాయతీల లబ్ధిదారులు ఆటోల్లో ఉదయం 8 గంటలకే బ్యాంకుల వద్దకు చేరుకున్నారు. అనంతగిరి మండలానికి చెందిన నాలుగు గిరిజన పంచాయతీల గిరిజనుల ఖాతాలు దేవరాపల్లి బ్యాంకుల్లో ఉన్నాయి. వారు బ్యాంకు లావాదేవీలు జరపకపోవడంతో ఖాతాలు మనుగడలో లేవు. దీని వల్ల రెండు రోజులుగా బ్యాంకులకు వచ్చిన వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. కాగా చోడవరంలో అన్ని బ్యాంకులు పింఛన్ లబ్ధిదారులతో శుక్రవారం కిటకిటలాడాయి. పట్టణంలోని ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకుల సేవా కేంద్రాల వద్ద కొందరు లబ్ధిదారులు డబ్బులు తీసుకుంటుండగా, మరికొందరు బ్యాంకులకు పరుగులు తీశారు. చాలామంది తమతో పాటు కుటుంబ సభ్యులను వెంటబెట్టుకుని మండుటెండలో బ్యాంకులకు వచ్చారు. గొలుగొండ మండలం ఏఎల్‌పురం, పాతకృష్ణాదేవిపేట, చోద్యం, నాగాపురం, కొంగసింగి తదితర గ్రామాల్లో బ్యాంకులు, బ్యాంకు సేవా కేంద్రాలు వద్ద వృద్ధులు పడిగాపులు కాశారు. గొలుగొండ మండల కేంద్రంలో గల ఎస్‌బీఐ బ్రాంచి వద్ద వృద్ధులు పింఛన్ సొమ్ము కోసం బారులు తీరారు. గొలుగొండ మండలానికి చెందిన 25 గ్రామాలు, అల్లూరి సీతారామరాజు జిల్లాకు కొయ్యూరు మండలానికి చెందిన ఎనిమిది గ్రామాల లబ్ధిదారులకు ఈ బ్రాంచిలో ఖాతాలు ఉన్నాయి. వీరంతా ఉదయాన్నే బ్యాంకుకు వచ్చి పడిగాపులు కాశారు. నర్సీపట్నంలో పింఛన్‌దారులతో బ్యాంకులు రద్దీగా కనిపించాయి. పింఛన్ నగదు కోసం వృద్ధులు ఉదయాన్నే బ్యాంకుల వద్ద వేచి ఉన్నారు. గంటల తరబడి పడిగాపులు కాసి మండుటెండలో తిరుగుముఖం పట్టారు.

మండుటెండలో అవస్థలు పడ్డా..



నాకు సరిగా కనిపించదు, వినిపించదు. నిలవలేని స్థితిలో బ్యాంకు వద్దకు ఆటోలో వచ్చాను. మండుటెండలో అవస్థలు పడుతున్నాం. గత నెలలో మాదిరిగా సచివాలయం వద్ద ఇచ్చినా బాగుండేది.

\- కె.మహలక్ష్మి, రైవాడ

అజినోమోటో బయో ఫార్మాలో ప్రమాదం

... 5వ పేజీ తరువాయి

పనిచేశారు. రాత్రి పది గంటలకు డ్యూటీ ముగించుకుని ఇళ్లకు వెళ్లిపోయారు. గురువారం రాత్రి 11 గంటల తరువాత ఆ ఐదుగురు కార్మికులకు హఠాత్తుగా గొంతు నొప్పి రావడంతో స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. వెంటనే కుటుంబ సభ్యులు పరిశ్రమ సెక్యూరిటీ సిబ్బందికి సమాచారమిచ్చారు. ఆ ఐదుగురిని కంపెనీ యాజమాన్యం శుక్రవారం ఉదయం విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించింది. ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగానే ఉంది. అయితే విషవాయువు ఎలా లీకైందనేది తెలియరాలేదు. ప్రమాదాన్ని కంపెనీ యాజమాన్యం గోప్యంగా ఉంచడం పలు అనుమానాలకు తావిస్తున్నది. కాగా ప్రమాద విషయంపై శుక్రవారం సాయంత్రం పోలీసులకు సమాచారం వచ్చింది. సమాచారం మేరకు సీఐ బాల సూర్యారావు కంపెనీని సందర్శించి ప్రమాదానికి గల కారణాలను యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నర్సీపట్నం సెగ్మెంట్‌లో హోమ్ ఓటింగ్ ప్రారంభం

నర్సీపట్నం, మే 3 : హోమ్ ఓటింగ్ ప్రక్రియను శుక్రవారం రిటర్నింగ్ అధికారి జయరాం ప్రారంభించారు. హోమ్ ఓటింగ్ కోసం ఏర్పాటు చేసిన రూట్ అధికారులు బ్యాలెట్ పత్రాలు, బాక్సులు పట్టుకొని వెళ్లారు. నర్సీపట్నం నియోజకవర్గంలో 3,399 దివ్యాంగులు, 85 సంవత్సరాలు పైబడిన వృద్ధులు 58 మంది ఉన్నారు. ఎన్నికల అధికారులు వారి ఇళ్లకు వెళ్లి ఓటర్ల అభిప్రాయం తీసుకున్నారు. కేవలం 179 మంది వృద్ధులు, 58 మంది దివ్యాంగులు ఇంటి దగ్గర నుంచి ఓటు వేయడానికి పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. నాతవరం మండలాన్ని రెండు రూట్లు, గొలుగొండ, నర్సీపట్నం, మాకవరపాలెం మండలాలను ఒక్కొక్క రూట్ కింద విభజించారు. ఒక రూట్ ఆఫీసరు, బీఎల్‌వో, సెక్టార్ అధికారి, పోలీసు ఎస్కార్ట్ ఈ బృందంలో ఉన్నారు. పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులు, వృద్ధుల వద్దకు స్వయంగా వెళతారు. మొదటి విడత మూడు రోజులు పాటు ఈ ప్రక్రియ కొనసాగుతుంది. మొదటి విడతలో ఓటరు అందుబాటులో లేక రెండో విడతలో హోమ్ ఓటింగ్‌కి అవకాశం కల్పిస్తారు. రెండో వ్యక్తి ప్రమేయం లేకుండా దరఖాస్తుదారుడు ఓటు వేసి బ్యాలెట్ బాక్సులో వేయాల్సి ఉంటుంది. ఆరోగ్య పరిస్థితితో శరీరం సహకరించని పరిస్థితిలో సెక్టార్ అధికారి సదరు ఓటరుతో అనుబంధ పత్రం-14 తీసుకొని కుటుంబ సభ్యులలో ఒకరిని అతనికి సహాయకుడుగా అనుమతిస్తారు. పోస్టల్ బ్యాలెట్ అందించి వారితో సీలు వేసిన బాలెట్ బాక్సులో ఓటు వేయిస్తారు.



హోమ్ ఓటింగ్ వాహనాలను ప్రారంభిస్తున్న రిటర్నింగ్ అధికారి జయరాం

సీఎం రమేశ్‌ను విమర్శించే స్థాయి బూడికి లేదు : జనసేన

నర్సీపట్నం అర్బన్, మే 3: బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌ను విమర్శించే స్థాయి బూడి ముత్యాలనాయుడుకు లేదని జనసేన నర్సీపట్నం నియోజకవర్గ సమన్వయకర్త రాజాన వీరసూర్యచంద్ర అన్నారు. శుక్రవారం ఆయనిక్కడ విలేకర్లతో మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే గణేష్ ఇంటి వద్ద ముత్యాలనాయుడు విమర్శలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సొంత కుమారుడికే న్యాయం చేయలేని బూడి పార్లమెంట్ నియోజకవర్గానికి ఏం న్యాయం చేయగలవని ప్రశ్నించారు.

చోడవరం
నియోజకవర్గం

చోడవరంలో నూతన ఓటర్లే కీలకం

▸▸ నియోజకవర్గ పరిధిలో కొత్తగా 21వేల 885 మంది యువతకు ఓటు హక్కు

బుచ్చెయ్యపేట, మే 3: సార్వత్రిక ఎన్నికల్లో అభ్యర్థులు ప్రచారం పర్వంలో దూసుకుపోతున్నారు. ఈ సారి చోడవరం నియోజకవర్గం గెలుపులో నూతన ఓటర్లే కీలకం కానున్నారు. అనకాపల్లి జిల్లాలోనే అత్యధికంగా చోడవరం నియోజకవర్గంలో 21వేల 885 మంది తొలిసారిగా యువ ఓటర్లు ఓటు హక్కు పొందారు. నియోజకవర్గ పరిధి చోడవరం మండలంలో 7వేల 326, రావికమతంలో 5వేల 556, బుచ్చెయ్యపేటలో 5వేల219, రోలుగుంటలో 3వేల 784 మంది తొలిసారిగా ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. గతంలో జరిగిన ఎన్నికలలో కంటే ఈ సారి ఎన్నికల్లో యువ ఓటర్లే విజయవకాశాలను నిర్దేశించే అవకాశాలున్నట్టు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. దీంతో వీరిని ఆకట్టుకునేలా వివిధ పార్టీల నాయకులు ప్రచార వ్యూహాలు రచిస్తున్నారు. తాము గెలిస్తే ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని బరిలో ఉన్న అభ్యర్థులు వారికి హమీలు ఇస్తున్నారు. విజయవకాశాల్లో కీలకమైన యువ ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు ప్రధాన పార్టీలైన టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి, వైసీపీ అభ్యర్థులు పోటీపడుతున్నారు. వైసీపీ గత మేనిఫేస్టోలో ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్న హమీ విఫలంపై కూటమి అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. యువతను మోసగించిన వైసీపీకి బుద్ధిచెప్పాలని ప్రచారం చేస్తున్నారు. కూటమిని గెలిపిస్తే మెగా డీఎస్సీ, ఏడాదికి 20 లక్షల ఉద్యోగాలు కల్పన, నిరుద్యోగ భృతి పథకాలను అమలు చేస్తామని కూటమి అభ్యర్థులు యువ ఓటర్లకు హమీ ఇస్తున్నారు. ఇచ్చిన హమీలో 95 శాతం అమలు చేసిన తమకే ఓటు వేయాలని వైసీపీ అభ్యర్థులు ప్రచారం చేస్తున్నారు. నియోజకవర్గం ఎన్నికల్లో యువ ఓటర్లే నిర్ణయాత్మక శక్తిగా మారడంతో వీరిని ప్రసన్నంగా చేసుకోవడానికి నాయకులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు.

గోవాడ షుగర్స్ అభివృద్ధి బాధ్యత నాదీ..

▸▸ అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్

చోడవరం, మే 3: తాను ఎంపీగా గెలిచిన వెంటనే కష్టాల్లో ఉన్న గోవాడ షుగర్ ఫ్యాక్టరీని అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటానని అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ భరోసా ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం రాత్రి గోవాడ ఫ్యాక్టరీ ఎదుట ఫ్యాక్టరీ కార్మికులు, స్థానికులతో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. గోవాడ చెరకు రైతులను ఆదుకోవడంతోపాటు, కార్మికులకు అండగా ఉంటానని అన్నారు. ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు చేసి ఫ్యాక్టరీ అభివృద్ధిలో నడిపించే బాధ్యత తాను తీసుకుంటానని భరోసా ఇచ్చారు. చెరకు రైతులు కార్మికులకు సకాలంలో బకాయిలు చెల్లించేలా చూడడంతో పా టు, చెరకు మద్దతు ధర టన్నుకు రూ.3500 వచ్చేలా కృషి చేస్తానని హమీ ఇచ్చారు. రాష్ట్రంలో వైసీపీ తలకిందులు తపస్సు చేసినా కూటమి విజయం తధ్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. చోడవరం నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే మాజీ ఎమ్మెల్యే రాజును తనను గెలిపించాలని ఆయన కోరారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు, ఈ ప్రాంతంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి ఆదుకుంటామన్నారు. పార్లమెంట్ పరిధిలో అన్ని నియోజకవర్గాల్లో అభివృద్ధి ఏవిధంగా ఉంటుందో చేసి చూపిస్తామన్నారు. రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబు సారథ్యం అవసరమని, మోడీ, చంద్రబాబు, పవన్‌ల సహకారంతో రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపించేలా ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, జిల్లా టీడీపీ అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, జనసేన ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు, గోవాడ షుగర్స్ మాజీ ఛైర్మన్ గూనూరు మల్లునాయుడు, బీజేపీ నాయకులు ఈర్లె శ్రీరామమూర్తి, మాజీ ఎంపీపీ పెదబాబు, గోవాడ షుగర్స్ కార్మిక సంఘం నాయకులు శరగ డం రామునాయుడు, రాయి సూరిబాబు, కేఎస్ ప్రకాశ్, దాడి నాగేశ్వరరావు, శరకాన అప్పలనాయుడు, మండల పార్టీ అధ్యక్షు డు బొడ్డేడ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.


గోవాడలో మాట్లాడుతున్న సీఎం రమేష్

హోమ్ ఓటింగ్ తీరుపై టీడీపీ నేతల మండిపాటు

▸▸ నకిలీ ఏజెంట్ల పత్రాలతో వైసీపీ నేతల తిరుగుతున్నట్టు ఈసీకి ఫిర్యాదు

రోలుగుంట, మే 3: మండలంలోని నిర్వహించిన హోమ్ ఓటింగ్ తీరుపై టీడీపీ పార్టీ నాయకులు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. తొలిరోజు శుక్రవారం పీఓ కాశీ విశ్వేశ్వరరావు బృందం రోలుగుంట, కె.నాయుడుపాలెం, అంట్లపాలెం, నిండుగొండ, ఎస్.కొత్తూరు గ్రామాల్లో 85 ఏళ్లు దాటిన ఓటర్లకు హోమ్ ఓటింగ్ ప్రక్రియను నిర్వహించారు. కాగా, నిండుగొండ గ్రామంలో బూత్ నెల 14లో హోమ్ ఓటింగ్‌కు సంబంధించి ఆవుగడ్డి నూకాలతల్లి వద్ద ఓటు వేయించేందుకు అధికారులు ఆమె ఇంటి వద్దకు వెళ్లగా.. ఎన్నికల అధికారుల వెంట బూత్ ఏజెంట్లుగా ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, ఎస్.కొత్తూరు సర్పంచ్ పోతల రాజశేఖర్ ఉండడంతో టీడీపీ నాయకులు గమనించి అడ్డుకోవడంతో అక్కడనుంచి వారు జారుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు పెద్దఎత్తున అక్కడకు చేరుకోవడంతో ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. వైసీపీ నాయకులను వెంట తీసుకువెళ్లడంపై పీఓను ఈ సందర్భంగా నిలదీశారు.

వీరు నకిలీ ఏజెంట్ల ధ్రువపత్రాలతో ఏజెంట్లుగా ఎన్నికల అధికారుల వెనుక తిరుగుతూ, ఓటర్లను ప్రలోభానికి లోనుచేసి వైసీపీకి అనుకూలంగా ఓట్లు వేయించుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

దీనిపై క్షేత్రస్థాయి విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షులు గుములూరు చంద్రమౌళి, ఎంపీటీసీ సభ్యుడు సుర్ల రామకృష్ణ, క్లస్టర్ ఇన్‌చార్జి సుర్ల బాబులునాయుడు, బంటు చిరంజీవి తదితరులు ఎలక్షన్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.


పీఓ కాశీవిశ్వేశ్వరరావును నిలదీస్తున్న టీడీపీ నేతలు

మాడుగుల
నియోజకవర్గం

ఘనంగా షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం


పూజల్లో భక్తులు

మాడుగుల, మే 3: స్థానిక షిర్డీసాయి ఆలయంలో శుక్రవారం ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ 25వ వార్షికోత్సవం సందర్భంగా ఉదయం ఆరు గంటల నుంచి నగర సంకీర్తన చేపట్టారు. అనంతరం ఆలయంలో షిర్డీసాయికి కాకడ హారతి, మృత్యుంజయ హోమం, పంచామృతంతో పాటు పలు అభిషేకాలను చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం బాబావారి పల్లకి ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ కార్యక్రమం చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఖాతాలో జమకాని వారికి ఇంటికి వెళ్లి పింఛన్లు పంపిణీ

మాడుగుల, మే 3 : బ్యాంక్ ఖాతాల్లో జమకాని పెన్షన్‌దారులకు ఇంటికి తీసుకు వెళ్లి పింఛన్ నగదుని అందించేలా చర్యలు తీసుకుంటున్నట్టు ఎంపీడీవో ఆర్. కాళిప్రసాద్ తెలిపారు. మండలంలో మొత్తం 9వేల 20మందికి పెన్షన్లు అందించాల్సి ఉండగా, వారితో బ్యాంక్ ఖాతాలు ఉన్నవారికి అకౌంట్‌లో జమచేశామన్నారు. మిగిలిన వారికి ఇంటింటికి సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు.


చోడవరం బ్యాంకులో కౌంటరు వద్ద క్యూ


నిస్పహాయ స్థితిలో కూర్చున్న వృద్ధులు

రెండోరోజూ కని'పింఛన్' కష్టాలెన్నో..

▸▸ బ్యాంక్‌ల వద్ద తప్పని పడిగాపులు

▸▸ ఎండలో అవస్థలు వర్ణనాతీతం

చోడవరం, మే 3: పింఛనుదారులకు కష్టాలు తీరడం లేదు. బ్యాంకుల వద్ద డబ్బులకోసం పడిగాపులు పడుతున్నారు. పట్టణంలోని ప్రధాన ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకులు సేవాకేంద్రాల వద్ద పింఛనుదారులు డబ్బులు తీసుకుంటుండగా, మరికొందరు బ్యాంకులకు పరుగులు తీస్తున్నారు. చాలామంది తమతో పాటు కుటుంబ సభ్యులతో బ్యాంకులకు వస్తున్నారు. మండుటెండలో లబ్దిదారులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని 13వేల 621 పింఛన్లకు గాను 127మందికి మినహా మిగిలిన వారికి వారి వారి బ్యాంకు ఖాతాలకు పింఛను డబ్బులు జమ చేశారు. బ్యాంకు ఖాతాలు లేని 127మందికి సచివాలయ సిబ్బందితో నేరుగా ఇవ్వడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా , 13వేల 494మంది పింఛన్లు బ్యాంకు ఖాతాలలో పడడంతో మండలంలోని అన్ని బ్యాంకు శాఖల వద్ద ఈసొమ్ము విత్ డ్రాకు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. గంటల తరబడి వేచి ఉండకతప్పకపోవడంతో పింఛనుదారులు వినియోగదారుల సేవా కేంద్రాల వద్ద వేచి ఉంటున్నారు.

రారెత్తిస్తున్న ఎండలు- జనం బెంబేలు

రావికమతం, మే 3: రోజు రోజుకు ఎండలు పెరిగిపోతున్నాయి. ఉదయం తొమ్మిది గంటలకే భానుడు నిప్పుల కుంపటిలా మారడంతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. పది రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. దీనికితోడు వడగాల్పులు మరింతగా ఇబ్బంది పెడుతున్నాయి. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకూ వేడి గాలుల ధాటికి గర్భిణులు, పిల్లలు, వృద్ధుల అవస్థలు వర్ణనాతీతం. ఉదయం పది గంటలు దాటాక చాలామంది ఇళ్లకే పరిమితమవుతున్నారు.రైతులు,ఉపాధి కూలీలు ఎండ తీవ్రతను భరించలేక పది గంటలకే పనులు సరిపెట్టి ఇంటిదారి పడుతున్నారు.పది రోజులుగా రావికమతంలో 44.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదుకాగా, శుక్రవారం 45డిగ్రీలు ఉంది.

ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి

మాడుగుల రూరల్: ఎండతీవ్రతకు ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఉదయం పది గంటలకే ఉష్ణో గ్రతలు పెరిగిపోతున్నాయి. మధ్యాహ్న సమయంలో ఎండవేడిమిని తట్టుకోలేక జనం ఆపసోపాలు పడుతున్నారు. ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు భయపడిపోతున్నారు. ఫ్యాన్లు వేసుకున్నా వేడిగాలులు వస్తున్నాయి. వడగాల్పు హైరానా పడుతున్నారు. ఇక ప్ర యాణికులు, వాహనచోదకులు పరిస్థితి మరింత దారుణంగా ఉంది. వడగాల్పు తగలకుండా ఉండేందుకు ముఖానికి తువ్వాళ్లు, చేతిరుమాళ్లు కట్టుకుని ప్రయాణాలు సాగిస్తున్నారు. సాయంత్రం ఐదవుతున్నా వాతావరణం చల్లబడటం లేదు.


మధ్యాహ్నం నిర్మానుష్యంగా మారిన రావికమతం రోడ్డు


దేవరాపల్లిలో కురుస్తున్న వర్షం

దేవరాపల్లిలో ఈదురుగాలులో వర్షం

దేవరాపల్లి: మండలంలో శుక్రవారం ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. మధ్యాహ్నం వరకు ఎండ విపరీతంగా కాసింది. సాయంత్రం ఈదుగాలులతో కూడిన వర్షం పడింది. కొద్దిరోజులుగా ఎండలతో ఉక్కిరిబిక్కిరవుతున్న జనాలు ఈ వర్షంతో కొంతమేరకు ఉపశమనం పొందారు. పలు గ్రామాల్లో కూరగాయలు పంటలకు నీటి తడులు అందుతాయని రైతులు చెబుతున్నారు.